



తెనాలి చంద్రబాబునాయుడు కాలనీలో రూ. 9.5 కోట్లతో నిర్మించాల్సిన యూనిట్‌కు తుప్పు



పాపినేని శివశంకర్‌తో పెనుగొండ లక్ష్మీనారాయణ(పాత చిత్రం)



పెనుగొండ లక్ష్మీనారాయణ దంపతులు



పాత చెరుకుంపాలెంలోని కుటుంబ సభ్యుల ఇల్లు

పెనుగొండ.. సాహితీకొండ



- సాహిత్యోద్యమంలో లక్ష్మీనారాయణది విశేషపాత్ర
- 200కుపైగా వ్యాసాలు.. 50కు పైగా కవిత, కథా, సంపుటిల రచన
- దీపిక వ్యాస సంపుటిని వరించిన కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు
- అరసం జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైన తెలుగు సాహితీవేత్తగా గుర్తింపు


గుంటూరు(తూర్పు),నూజెండ్ల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): దాదాపు 50 కవిత్వ, కథా, వ్యాస సంపుటాలకు ముందు మాట, పదుల పుస్తకాల సమీక్ష, 200 వ్యాసాలు, దాదాపు 600 సాహిత్య సభలు, సమావేశాలు, సదస్సులు.. మేడే నాడు కవితా గోష్టులు.. నిర్వహించి సాహితీ ప్రపంచంలో పెనుగొండ లక్ష్మీనారాయణ విశేష పాత్ర పోషించారు. పల్నాడు జిల్లా నూజెండ్ల మండలం పాతచెరుకుంపాలెంలో 1954 అక్టోబరు 24న జన్మించిన పెనుగొండ యాభై ఏళ్లుగా అభ్యుదయ సాహిత్యోద్యమంతో ప్రగాఢమైన సాన్నిహిత్యాన్ని పెంపొందించుకున్నారు. ప్రముఖ కమ్యూనిస్టు యోధుడు పులుపుల వెంకటశివయ్యను అనుసరిస్తూ ఎన్ని ఒడిదుడుకులు వచ్చినా వెనుదిరగక ముందుకు ప్రయాణించి సాహితీ ప్రపంచంలో అనేక అవార్డులు, ప్రశంసలు అందుకున్న పెనుగొండను కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వరించింది.

సాహిత్యానికి సంబంధించిన అనేక చారిత్రాత్మక విశేషాలను తెలియజేసే ఎన్నో వ్యాసాలను రచించారు. ఒక పుస్తకాన్ని రాయడానికి ఎన్నో పుస్తకాలు పరిశీలించడం, తేదీలు, పుటలతో సహా ఆధారాలు చూపడం, వీలైనంత సమగ్ర సమాచారాన్ని ఇవ్వడం పెనుగొండ రచనాశైలి ప్రత్యేకత. కవి సమ్మేళనాలు సంక్రాంతి, ఉగాది పండుగల సందర్భాలో జరుగుతుంటాయి. అయితే ప్రత్యామ్నాయ సంస్కృతిని ప్రతిపాదిస్తూ అంతర్జాతీయ శ్రామిక దినమైన మేడే నాడు కవితా గోష్టులను ఆయన నిర్వహించారు. అరసం, అవగాహన సామాజిక, సాంస్కృతిక వేదికల ఆధ్వర్యంలో దాదాపు 15ఏళ్ల పాటు గుంటూరులో మేడే రోజున కవితా గోష్టులను నిర్వహించిన ఘనత పెనుగొండకే దక్కుతుంది. పెనుగొండ సంకలనకర్తగా 5 పుస్తకాలకు

(మిగతా 6వ పేజీలో)

దీపిక.. ప్రత్యేకత...

పెనుగొండ లక్ష్మీనారాయణ 2021లో రచించిన దీపిక వ్యాస సంపుటికకు ప్రస్తుతం కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు దక్కింది. తెలుగు నుంచి మొత్తం 14 పుస్తకాలను జ్యూరీ సిఫారసు చేయగా పెనుగొండ రచించిన 'దీపిక' సంపుటికి అవార్డు దక్కింది. ఈ సంపుటిలో మొత్తం 36 వ్యాసాలు ఉన్నాయి. వీటిని 10 విభాగాలుగా విభజించారు. ఇందులో ప్రధానంగా పల్నాటి సీమ, తెలంగాణ, రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాల్లో అరసం పాత్రను సాహిత్య చరిత్రను వివరించారు. ప్రపంచీకరణ-తెలుగు సాహిత్యం, తెలుగు సాహిత్య విమర్శ సాధికార విశ్లేషణలతో కూడిన అభ్యుదయ సాహిత్యానికి సంబంధించిన వ్యాసాలున్నాయి. కేంద్ర అవార్డుతో పాటు పలువురి విమర్శకుల నుంచి ప్రశంసలు పొందారు.



మురుగు శుద్ధికి.. ఏదీ చిత్తశుద్ధి

పట్టణాలను వీడని మురుగు కంపు

పట్టణ జీవనం అంటే ఏమున్నది!... చెత్త కుప్పలు, ముక్కులు పగిలే మురుగు కంపు తప్ప... ఇది ఇప్పటి వరకు ఎందరో కవులు, ప్రముఖులు చేసిన వర్ణనలు. అయితే అవేమీ ఇకపై కనిపించకూడదని, మురుగు నీటిని కూడా మంచినీరుగా మార్చేసి, సాగుకు, ఇతర అవసరాలకు ఉపయోగపడే విధంగా మార్పులు చెయ్యాలనేది కేంద్రం ఆలోచన. దీనికి తగ్గట్టుగానే ఉమ్మడి గుంటూరు జిల్లాలో అన్ని పట్టణాలు, నగరాల్లో మురుగు శుద్ధి ప్లాంట్‌లను నిర్మించేందుకు రూ. వెయ్యి కోట్లకుపైగా నిధులను వివిధ దశల్లో మంజూరు చేసింది. ఆ నిధులను సద్వినియోగం చేసుకున్న మున్సిపాలిటీలు కొన్నయితే, చాలా మున్సిపాలిటీలు నిర్లక్ష్యంగా వ్యవహరించటంతో పట్టణాలను కమ్ముకున్న మురుగు కంపు మాత్రం వదలటంలేదు.

- రూ. 1014 ప్రాజెక్టుల్లో అడుగు పడని వైనం
- గత వైసీపీ ప్రభుత్వంలో పూర్తి నిర్లక్ష్యం
- నిధులున్నా పనులు సున్నా
- ఆరేళ్లవుతున్నా ఇంకా స్థల సేకరణ దశలోనే
- ఒకటి రెండు చోట్లే పూర్తి... మిగిలినవి మొదలే లేదు

తెనాలి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణాల దశ మార్చేందుకు మురుగునీటి శుద్ధి కేంద్రాల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం భారీగా నిధులు మంజూరు చేసింది. దీనివలన ప్రమాదకరమైన కలుషిత వ్యర్థ జలాలను శుద్ధిచేసి ఇతర అవసరాలకు ఉపయోగించవచ్చు. భవిష్యత్తులో నీటి కొరత ఏర్పడితే, ఇది ప్రత్యామ్నాయంగా ఉపకరిస్తుందనేది కేంద్రం భావన, అయితే కేంద్రాల నిర్మాణం ఇంకా స్థల సేకరణ దశలోనే ఆగిపోయి ఉంది. తెనాలి, నరసరావుపేట, వంటి ఒకటి, రెండు మున్సిపాలిటీల్లో మినహా మిగిలిన మున్సిపాలిటీల్లో ఎక్కడి ప్రాజెక్టులు అక్కడే ఉన్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో రూ. 1014 కోట్లతో స్థల సేకరణ, నిర్మాణాలు, నిర్వహణ పనులు చేయాల్సి ఉంది. గుంటూరు జిల్లాలోని గుంటూరు కార్పొరేషన్, తెనాలి, పొన్నూరు మున్సిపాలిటీల్లో రూ. 597.5 కోట్లతో, పల్నాడు జిల్లాలోని మున్సిపాలిటీల్లో రూ. 254 కోట్ల ప్లాంట్‌లు, బాపట్ల జిల్లాలో రూ. 163 కోట్ల నిధులతో మురుగు శుద్ధి ప్లాంట్‌లను నిర్మించాల్సి ఉంది. వీటిలో కొన్నింటికి ప్రభుత్వ స్థలాలు అందుబాటులో ఉంటే, చాలా వాటికి ప్రయివేటు స్థలాలను కొనుగోలు చేయాల్సి ఉంది. గుంటూరు కార్పొరేషన్‌లో మొత్తం ప్రభుత్వ స్థలమే ఉన్నా, పనులు ముందుకు సాగకపోవటం విశేషం.

గత వైసీపీ సర్కారు నిర్వాకంతో...

కేంద్రం మురుగునీటి శుద్ధి ప్లాంట్ల నిర్మాణం వేగవంతం చెయ్యాలని గతంలోనే ఆదేశించింది. అయితే రాష్ట్రంలో అప్పట్లో అధికారంలో ఉన్న వైసీపీ సర్కారు మాత్రం వీటిపై దృష్టే పెట్టలేదు. చాలాచోట్ల స్థలాలు సేకరించాల్సి ఉన్నా, వారి నేతల ఆక్రమణలకే ప్రాధాన్యం

(మిగతా 8వ పేజీలో)



తెనాలి పూలే కాలనీలో నిర్మాణంలో ఉన్న ప్లాంట్



తెనాలిలో రూ. 28 కోట్లతో నిర్మిస్తున్న మురుగునీటి శుద్ధి ప్లాంట్

1న పులిపాడుకు సీఎం చంద్రబాబు



పిడుగురాళ్ల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సామాజిక పింఛన్ల పంపిణీ చేసేందుకు జనవరి 1న గురజాల నియోజకవర్గం పులిపాడులో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పర్యటించనున్నారు. పింఛన్ల పంపిణీ అనంతరం పులిపాడులో జరిగే గ్రామసభలో పాల్గొననున్నారు. ఈ మేరకు బుధవారం నిర్వహించిన కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ అరుణ్‌బాబు ముఖ్యమంత్రి పర్యటన విషయాన్ని అధికారులకు తెలిపారు. సీఎంవో నుంచి అందిన సమాచారం మేరకు జనవరి 1న పులిపాడులో ముఖ్యమంత్రి పర్యటించనున్నారన్నారు.

6
4,162 క్వింటాళ్ల బియ్యం వేలం
- రూ 1.34 కోట్లకు విక్రయం

సంగం స్వాధీనం జీవో నం.19 రద్దు

అందరి సహకారంతో అక్రమాలు
- 17 సహకార సంఘాల్లో రూ. 10.68 కోట్లు దుర్వినియోగం
- 184 మంది నకిలీ సభ్యుల పేర్లతో బినామీ రుణాలు
- జీడీసీసీ, రెవెన్యూ అధికారులు సూత్రధారులు

నకిలీ సర్టిఫికెట్ల రాకెట్‌లో వర్సిటీ ఉన్నతాధికారులు
- ఒక్కో సర్టిఫికెట్‌కు రూ.లక్షల్లో వసూలు
- పోలీసులకు వర్సిటీ అధికారుల ఫిర్యాదు

స్టాంప్ కష్టాలకు చెక్
- విక్రయాల్లో అక్రమాలను అరికట్టేందుకు ఈ-స్టాంపింగ్

గుంటూరులో ఉత్సాహంగా బాలికల స్పోర్ట్స్ మీట్
8
మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ఆటల పోటీలు ప్రారంభం

నదిలోనే రోడ్డు

ఇసుకాసురుల బరితెగింపు



అచ్చంపేట మండలం కోనూరు వద్ద నదిలో అక్రమంగా రోడ్డు వేసేందుకు వచ్చిన ఎక్స్‌కవేటర్లు



నదిలో అడ్డంగా వేసేందుకు నిల్వ ఉంచిన సిమెంట్ తూములు

- అధికార పార్టీ నేతల చెరలో కృష్ణమ్మ
- అధికారం అండతో రెచ్చిపోతున్న అక్రమార్కులు
- అడ్డగోలుగా తవ్వకాలు.. అధికారులకు బెదిరింపులు
- వైసీపీ నేతలకు మించి యథేచ్ఛగా టీడీపీ నేతల తవ్వకాలు
- విజిలెన్స్ తనిఖీల్లో అక్రమాలు తేల్చినా తగ్గని అక్రమార్కులు

అచ్చంపేట, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): నదీ గర్భంలోని ఇసుక తవ్వి తీసుకురావాలంటే కష్టమనుకున్నారేమో.. ఏకంగా నదిలోనే రోడ్డు వేసుకుంటున్నారు. నది మధ్య వరకు వాహనాలను తీసుకెళ్లి ఇసుక తవ్వి తరలించుకునేందుకు అధికార పార్టీ నేతలు బరితెగించారు. ఇసుక జోలికి వెళ్ల వద్దని సాక్షాత్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు పదేపదే హెచ్చరిస్తున్నా నేతలు లక్ష్య పెట్టడంలేదు. నదీ ప్రవాహానికి అడ్డుగా రోడ్డు వేస్తున్నా అధికారులు అటు వైపు దృష్టి సారించడంలేదు. అధికారం మాది అడిగేదెవరు.. ఆపేదెవరు అన్న రీతిలో నేతలు రెచ్చిపోతున్నారు. అక్రమార్కులకు ఇద్దరు ప్రజాప్రతినిధులు కొమ్ముకాస్తున్నారన్న ఆరోపణలున్నాయి. నదిలో జరుగుతున్న అక్రమాలపై ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకునే సాహసం అధికారులు చేయడంలేదు. ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లకు తలొగ్గక తప్పడంలేదు. నాడు వైసీపీ నేతలు ఇసుక అక్రమాలకు పాల్పడగా వారిని తీవ్రస్థాయిలో విమర్శించిన టీడీపీ నేతలు కొందరు అంతకు మించి అక్రమాలకు పాల్పడుతున్నారన్న విమర్శలు వస్తున్నాయి. అక్రమంగా ఇసుక తవ్వకాల్లో వైసీపీకి ఏమీ తీసిపోమని టీడీపీ నేతలు కొందరు నిరూపిస్తున్నారు. అచ్చంపేట మండలంలోని కోనూరు రీచ్‌లో కాంట్రాక్టర్లు బరితెగిస్తున్నారు. రేవు నుంచి రెండు కిలోమీటర్ల దూరంలోని ఇసుకను కాజేసేందుకు కాంట్రాక్టర్లు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో అక్కడ వరకు వెళ్లాలంటే నదికి రోడ్డు అడ్డంగా వేయాల్సి ఉంది. దీంతో నదిని చీల్చుతూ సుమారు కిలో మీటరున్నరకు పైగా రోడ్డు నిర్మిస్తున్నారు. రోడ్డు నిర్మాణానికి పెద్దసంఖ్యలో ఇసుక బస్తాలు, సిమెంట్ తూములు వినియోగించారు. నదికి

(మిగతా 6వ పేజీలో)



నదిని చీల్చుతూ అడ్డంగా ఉంచిన తూములు



కోనూరు వద్ద కృష్ణానదిలో నదికి అడ్డంగా కిలో మీటరుకు పైగా వేసిన రోడ్డు

ఆ మున్సిపాల్టీలకు.. జూన్‌లో ఎన్నికలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

- స్పష్టత ఇచ్చిన మంత్రి నారాయణ
- నరసరావుపేట, బాపట్ల, పొన్నూరుల్లో నిలిచిన ఎన్నికలు
- ఆర్థిక సంఘం నిధులు కోల్పోతున్న నేపథ్యంలో ప్రభుత్వం నిర్ణయం



నరసరావుపేట పురపాలక సంఘ కార్యాలయం

వివిధ కారణాలతో గతంలో నిలిచిపోయిన మున్సిపాల్టీల్లో ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం సమాయత్తమవుతోంది. ఎన్నికల నిర్వహణకు నెలకొన్న చిక్కులను పరిష్కరించి జూన్‌లో ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు చేపడుతోంది. ఎన్నికల నిర్వహణపై మంత్రి నారాయణ బుధవారం స్పష్టత ఇచ్చారు. ఎన్నికలు జరగని కారణంగా మున్సిపాల్టీలు ఆర్థిక సంఘం నిధులను కోల్పోతున్నాయి. దీంతో అభివృద్ధి కుంటుపడుతుండటంతో ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లా కేంద్రాలైన నరసరావుపేట, బాపట్లతో పాటు గుంటూరు జిల్లా పరిధిలోని పొన్నూరు మున్సిపాలిటీకి సంబంధించి కోర్టులో కేసులు నేపథ్యంలో గతంలో ఎన్నికలు జరగలేదు. ఎన్నికలు నిర్వహించకపోవడాన్ని కేంద్రం తీవ్రంగా పరిగణించి ఆర్థిక సంఘం నిధులను నిలిపేసింది. మూడు మున్సిపాల్టీలు దాదాపు రూ.8.91 కోట్లను కోల్పోయాయి. ఆయా మున్సిపాల్టీలలో పొరుగున ఉన్న పంచాయతీలను విలీనం చేసి వార్డుల సంఖ్యను పెంచారు. అధికారం అండతో అధికారులపై ఒత్తిడి తెచ్చి నేతలు వారికి అనుకూలంగా వార్డుల పునర్ విభజన చేయించారు. వార్డుల విభజన సక్రమంగా జరగలేన్న అభ్యంతరాలు వచ్చినా అధికారులు లక్ష్య పెట్టలేదు. ఫలితంగా బాధితులు కోర్టును ఆశ్రయించడంతో నరసరావుపేట, పొన్నూరు, బాపట్ల మున్సిపాల్టీల్లో ఎన్నికలు నిలిచిపోయాయి. దీంతో 2022-23 ఆర్థిక సంవత్సరం రెండో విడత కింద నరసరావుపేటకు రూ.3.79 కోట్లు, బాపట్ల రూ.3.16 కోట్లు, పొన్నూరు మున్సిపాలిటీలకు రూ.1.96 కోట్లు విడుదల య్యాయి. మూడో విడత కూడా అదే స్థాయిలో నిధులు విడుదల కావాల్సి ఉంది. ఎన్నికలు జరగని కారణంగా నరసరావుపేట రూ.3.79 కోట్లు, బాపట్ల రూ.3.16 కోట్లు, పొన్నూరు మున్సిపాల్టీ రూ.1.96 కోట్లు నిధులు నిలిచిపోయాయి. ఈ నిధులు సమకూరి ఉంటే ఆయా పట్టణాల్లో చాలా వరకు రహదారులు, కాల్వలు, ఇతర మౌలిక వసతుల నిర్మాణాలు చేపట్టే అవకాశం ఉండేది. ఎన్నికలు నిర్వహించకపోవడం ఆయా మున్సిపాల్టీల ఆర్థిక అవకాశాలను దెబ్బతీసింది. ఈ క్రమంలో ఈ మున్సిపాల్టీలకు జూన్‌లో ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి నారాయణ ప్రకటించారు. దీంతో మున్సిపాలిటీల ఆర్థిక వెతలు తీరతాయని చెప్పవచ్చు.

త్రిముఖ వ్యూహాన్ని అనుసరించాలి



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ కేఎస్ వరప్రసాద్

గుంటూరు (విద్య), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్‌లో అమలు చేస్తున్న త్రిముఖ వ్యూహాన్ని (నాణ్యత, భద్రత, ప్రపంచ మార్కెట్‌లో సులభ వాణిజ్యం) మనం కూడా అనుసరించాలని ఐకార్ ఐఐవోఆర్ మాజీ డైరెక్టర్, అపారి ప్రాజెక్ట్ మేనేజర్ డాక్టర్ కేఎస్ వరప్రసాద్ అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో 'ప్లాంట్ హెల్త్ ఇన్ ఆసియా : రీసెర్చ్ ప్రయారిటీస్ అండ్ పార్ట్‌నర్‌షిప్స్' అనే అంశంపై రెండు రోజుల పాటు నిర్వహించిన అంతర్జాతీయ సదస్సు బుధవారం ముగిసింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ కేఎస్ వరప్రసాద్ మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో ఎస్‌పీఎస్ (శానిటరీ, ఫైటోశానిటరీ) అనేవి వ్యవసాయ ఉత్పత్తులు, ఆహార ఉత్పత్తులు, ఆరోగ్యభద్రత, పర్యావరణ పరిరక్షణకు రూపొందించిన నిబంధనలని తెలియజేశారు. కార్యక్రమంలో ఇటలీలోని ఐపీపీసీ సెక్రటేరియట్, ఎఫ్ఏవో ఇంప్లిమెంటేషన్ అండ్ ఫెసిలిటేషన్ లీడ్ డాక్టర్ సారా బ్రూనెల్, సౌత్ ఏసియా సీఏబీఐ ఇంటర్నేషనల్ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ వినోద్ పండిట్, రైతునేస్తం చైర్మన్ డాక్టర్ వై.వెంకటేశ్వరరావు విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వర్సిటీ వైస్ చాన్స్‌లర్ కల్నల్, ప్రొఫెసర్ పి.నాగభూషణ్, ఇంచార్జి రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంవీ రావు పాల్గొన్నారు..

విదేశీ విద్యపై బ్రోచర్ విడుదల

గుంటూరులోని హిందూ కాలేజి ఆఫ్ ఫార్మసీలో ఫార్మా, హెల్త్‌కేర్ విద్యార్థుల కోసం విదేశాల్లో ఉన్నత చదువులు, ఉద్యోగావకాశాలపై ప్రత్యేక సెషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఫార్మా విద్యార్థులకు విదేశీ విద్యలో ఉన్న ప్రత్యేక అవకాశాలపై బ్రోచర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో హిందూ గ్రూప్ చైర్మన్ జుపూడి రంగరాజు, ఫార్మసీ ప్రిన్సిపల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం, చైర్మన్ డాక్టరు నలబోతు రమేష్ పాల్గొన్నారు.

చిరుధాన్యాల పంటల సాగుపై కోర్సు

గుంటూరు సిటీ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో 2025 సంవత్సరం నుంచి చిరుధాన్యాల పంటల సాగు, యాజమాన్య పద్ధతులు, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సు ప్రారంభించనున్నట్లు రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామచంద్రరావు తెలిపారు. ఈ కోర్సు రెండు నెలలు కాల వ్యవధిలో పూర్తి చేయవచ్చునని వెల్లడించారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు రూ.1500 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవచ్చు అన్నారు. పూర్తి వివరాలకు వ్యవసాయ విశ్వవిద్యాలయం వెబ్‌సైట్ ను సందర్శించాలని సూచించారు.

అనుమర్లపూడి సర్పంచి చెక్ పవర్ రద్దు

పెదకాకాని, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పెదకాకాని మండల పరిధిలోని అనుమర్లపూడి సర్పంచి దానబోయిన సుభాషిని చెక్ పవర్‌ను రద్దు చేస్తూ డీపీవో నాగ సాయికుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. 2021లో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఒకే ఒక ఓటుతో ప్రత్యర్థులపై సుభాషిని గ్రామ సర్పంచిగా గెలిచారు. ఆమె పరిపాలన కాలంలో ఇప్పటి వరకు పంచాయతీకి సంబంధించిన రూ.11 లక్షల నిధులు దుర్వినియోగం అయినట్లు ఉన్నతాధికారుల విచారణలో బహిర్గతమైంది. దీంతో సర్పంచి చెక్ పవర్ రద్దు చేస్తూ డీపీవో ఉత్తర్వులు జారీ చేసినట్లు పెదకాకాని మండల ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు తెలిపారు.

అందరి సహకారంతో అక్రమాలు

- 17 సహకార సంఘాల్లో రూ. 10.68 కోట్లు దుర్వినియోగం
- 184 మంది నకిలీ సభ్యుల పేర్లతో బినామీ రుణాలు
- జీడీసీసీ, రెవెన్యూ అధికారులు సూత్రధారులు

గుంటూరు సిటీ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల్లో జరిగిన అవినీతి, అక్రమాలు రోజుకు ఒకటి వెలుగులోకి వస్తున్నాయి. సహకార సంఘాల్లో నకిలీ సభ్యుల పేరిట రూ.10.68 కోట్లు రుణాల రూపేణా దారిమళ్లించినట్లు తేలింది. ఉమ్మడి జిల్లాలోని 17 సహకార సంఘాల్లో 184 మంది నకిలీ సభ్యుల పేర్లతో ఈ తంతు కొనసాగింది. బాధ్యులైన అధికారులు సివిల్, క్రిమినల్ చర్యలు నిలువరించాలని కోరుతూ వేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. జీడీసీసీకి చెందిన 9 మంది మేనేజర్లు, 6 అసిస్టెంట్ మేనేజర్లు, 1 క్యాషియర్, 5 సూపర్‌వైజర్లు, కొంతమంది రెవెన్యూ అధికారులు సహకరించుకుని ఈ వ్యవహారం చేసినట్లు నిర్ధారణ అయింది. రెడ్డిపాలెం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో రుణాల మంజూరు పేరిట జరిగిన అక్రమాలపై సహకార శాఖ డిప్యూటీ రిజిస్ట్రార్, డివిజనల్ సహకార అధికారి విచారణ జరిపారు. ఇక్కడ కమిటీ అనుమతి లేకుండానే 55 మందిని సభ్యులుగా చేర్చుకున్నారు. వారిలో 50 మందికి సీసీ, కేసీసీ రుణాలు రూ. 2.99 కోట్లు మంజూరు చేశారు. క్షేత్రస్థాయిలో కనీస పరిశీలన లేకుండానే రుణాలు మంజూరు చేశారు. 50 మంది నకిలీ సభ్యులకు సమీప బ్యాంకులో ఖాతాలు తెరిచారు. ఆ సందర్భంలో బ్యాంకు అధికారులు కొత్త ఖాతాలు తెరిచే వ్యక్తుల ఆధార్, పాన్‌కార్డ్‌పై తగిన విచారణ లేకుండానే అనుమతి ఇచ్చారు. దీనివలన బినామీ వ్యక్తుల చేతుల్లోకి రుణాల సొమ్ము వెళ్లిపోయింది. గత ఐదేళ్ల కాలంలో క్యాష్ క్రెడిట్ సర్క్యులర్‌ని పూర్తిగా ఉల్లంఘించిన జీడీసీసీ అధికారులు ఇష్టానుసారంగా రుణాలు మంజూరు చేసి బినామీ రూపంలో ఉన్న వైసీపీ నేతలకు లబ్ధి చేకూర్చారు. మాచవరం మండలంలోనూ ఇదేవిధంగా జరిగింది. ఎక్కడ అవకాశం ఉంటే అక్కడ బ్యాంకు సొమ్ము కాజేసేందుకు ప్రయత్నాలు ముమ్మరంగా జరిగాయి.

ఆస్తుల నకిలీ బదిలీ

సహకార సంఘాల్లో జరిగిన అవినీతి, అక్రమాల్లో రెవెన్యూ అధికారులు కూడా సూత్రధారులుగా ఉన్నారు. నకిలీ సభ్యుల పేర్ల మీద ఆస్తుల బదిలీ ప్రక్రియలో అక్రమాలకు పాల్పడ్డారు. నకిలీ బదిలీ చేపట్టి ఆస్తి లేని వ్యక్తికి ఉన్నట్లుగా చూపించారు. ఇదంతా పల్నాడు ప్రాంతంలో ఎక్కువగా జరిగింది. అంతేకాకుండా నకిలీ ఈసీ (ఎన్‌కంబరెన్స్ సర్టిఫికెట్)లు కూడా తయారు చేశారు. విచారణ సందర్భంగా ఈ విషయాలు వెలుగులోకి వచ్చాయి. రుణాలు పొందేందుకు నకిలీ ఈసీలు సృష్టించారని పిడుగురాళ్ల సబ్ రిజిస్ట్రార్ నివేదిక ఇచ్చారు. మార్టిగేజ్‌లో కూడా అక్రమాలు జరిగినట్లు సబ్ రిజిస్ట్రార్ విచారణలో వెల్లడించారు.

4 సభ్యులకు 8 రుణాలు...

గత ప్రభుత్వ హయాంలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల్లో జరిగిన అవినీతి చూస్తుంటే ఆశ్చర్యం వేస్తుంది. పేరేచెర్లలో 4 సభ్యులకు 8 రుణాలు మంజూరు చేశారు. అవన్నీ బినామీలకే దక్కాయి. 4 సభ్యులకు కేసీసీ, సీసీ రుణాల పేరుతో రూ. 18 లక్షలు ఇచ్చారు. కొత్త సభ్యులకు రుణాలు ఇచ్చేటప్పుడు సీఈవో అనుమతి తీసుకోవాలని నిబంధనలు చెబుతున్నా వాటితో పనిలేకుండానే మేనేజర్‌లు ఇష్టానుసారంగా ప్రవర్తించారు.

తోసిపుచ్చిన హైకోర్టు...

సహకార శాఖ ఉన్నతాధికారులు జీడీసీసీలలో జరిగిన బినామీ రుణాల తంతుపై లోతుగా విచారణ జరిపారు. మేనేజర్లు, అసిస్టెంట్ మేనేజర్లు, సూపర్‌వైజర్లపై సివిల్, క్రిమినల్ చర్యలకు ఉపక్రమించారు. దీంతో జీడీసీసీ అధికారులు తమపై చర్యలు నిలిపివేయాలని కోరుతూ హైకోర్టుకు వెళ్లారు. అన్ని పిటిషన్లు విచారించిన జస్టిస్ టి.రాజశేఖర్‌రావు జీడీసీసీ అధికారుల అభ్యర్థనను తోసిపుచ్చారు. దీంతో బాధ్యులైన అధికారులు ఆందోళన చెందుతున్నారు.

సోషల్ మీడియా పోస్టులతో సంబంధం లేదు

- ధూళిపాళ్ల కుటుంబ సభ్యులపై పెట్టవద్దని సూచించా
- పోలీసుల విచారణలో మాజీ ఎమ్మెల్యే కిలారి

పొన్నూరుటౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ కుటుంబ సభ్యులపై సోషల్ మీడియా వేదికగా పెట్టిన పోస్టుల కేసులో మాజీ ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య రూరల్ పోలీస్‌స్టేషన్‌లో విచారణకు బుధవారం హాజరయ్యారు. ధూళిపాళ్ల కుటుంబ సభ్యులపై అసత్యాలు, అసభ్య కథనాలతో పోస్టులు పెట్టారని 2021 లోనే అప్పటి ఎమ్మెల్యే, ప్రస్తుత మాజీ ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య, వైసీపీకి చెందిన 12 మందిపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. సోషల్ మీడియా వేదికగా అసత్య కథనాలను పోస్టు చేస్తూ ప్రజల్లో తమ పట్ల వ్యతిరేక భావం తీసుకువచ్చేలా ప్రయత్నిస్తున్నారని ఎమ్మెల్యే ధూళిపాళ్ల కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసులో రూరల్ పోలీసులు విచారణ ప్రారంభించి పెదకాకాని గ్రామానికి చెందిన వైసీపీ సోషల్ మీడియా యాక్టివిస్ట్ షేక్ గోపీలాల్‌ను అరెస్టు చేశారు. గోపీలాల్ ఇచ్చిన వివరణ మేరకు మాజీ ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య, వైసీపీకి చెందిన 12 మందిని విచారణకు రావాలని రూరల్ పోలీసులు నోటీసులు జారీ చేశారు. అయితే పోలీసుల నోటీసులతో భయభ్రాంతులకు గురైన వైసీపీ నాయకులు అజ్ఞాతంలోకి వెళ్లారు. కిలారి రోశయ్య ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించగా పోలీసుల విచారణకు సహకరించాలని హైకోర్టు సూచించింది. హైకోర్టు ఆదేశాల మేరకు గత గురువారం కిలారి పోలీస్ విచారణకు వచ్చారు. సోషల్ మీడియా పోస్టులకు, తనకు ఎలాంటి సంబంధం లేదని తప్పించుకునే ప్రయత్నం చేశారు. తెలియదు, గుర్తులేదు, మర్చిపోయాననంటూ దాటవేత ధోరణి అవలంబించడంతో పోలీసులు మరో మారు విచారణకు రావాల్సి ఉంటుందని సూచించారు. పోలీసుల ఆదేశాల మేరకు బుధవారం మరోమారు కిలారి రోశయ్య రూరల్ పోలీస్ స్టేషన్‌లో విచారణకు హాజరయ్యారు. ప్రధాన నిందితుడిగా ఉన్న షేక్ గోపీలాల్ ఇచ్చిన నేర అంగీకార పత్రాన్ని కిలారి ముందు ఉంచి ప్రశ్నించారు. అయితే గోపి పార్టీలో తిరుగుతూ ఉంటారని, ఆయన పెట్టిన పోస్టులకు, తనకు సంబంధం లేదని మరోమారు తప్పించుకునే ప్రయత్నం రోశయ్య చేసినట్లు సమాచారం. అలాగే తమ పార్టీకి చెందిన ఈ కేసులో నిందితులుగా ఉన్న వ్యక్తులు పలుమార్లు ప్రెస్‌మీట్‌లో ధూళిపాళ్ల కుటుంబ సభ్యులపై చేస్తున్న వ్యాఖ్యలను తానే స్వయంగా ఖండించినట్లు రోశయ్య పోలీసులకు చెప్పినట్లు తెలిసింది. సోషల్ మీడియా గ్రూపులకు కిలారి వెంకట రోశయ్య అడ్మిన్‌గా ఉండటంతో ఫోను అప్పగించాలని పోలీసులు రోశయ్యను కోరారు. ప్రస్తుతం అప్పటి ఫోను వినియోగించడం లేదనీ, తరువాత అప్పగిస్తానని రోశయ్య సమాధానమిచ్చినట్లు సమాచారం. గంటన్నర పాటు రోశయ్యను పోలీసులు పలు అంశాలపై లోతుగా ప్రశ్నించారు. ముందస్తు బెయిల్ కేసు హైకోర్టులో గురువారం వాయిదా ఉన్న నేపథ్యంలో పోలీసులు హైకోర్టు ముందు రోశయ్య విచారణకు సహకరించారా, లేదా అనేది చెప్పాల్సి ఉంది.

నదిలోనే రోడ్డు

(5వ పేజీ తరువాయి)

అడ్డుకట్ట వేయడం వల్ల నీటి ప్రవాహం తగ్గి దిగువన వ్యవసాయ మోటార్లకు సరిగా నీరు అందడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కృష్ణా రివర్ కార్యాలయం, ఏ అధికారి నుంచి గాని రోడ్డుకు అనుమతులు లేవు. చర్యలు తీసుకునేందుకు అధికారులు ప్రయత్నిస్తే వారిపై ప్రజా ప్రతినిధుల ద్వారా అక్రమార్కులు బెదిరింపులకు పాల్పడుతున్నారన్న ఆరోపణలున్నాయి. అచ్చంపేట మండలం అంబడిపూడి, అమరావతి మండలం మల్లాది ప్రాంతాల్లో నిబంధనలు విరుద్ధంగా తవ్వకాలు జరుగుతున్నట్లు ఇటీవల విజిలెన్స్ అధికారులు తేల్చారు. వారు నిర్వహించిన తనిఖీల్లో ఇసుక అక్రమాలు వెలుగు చూసిన విషయం తెలిసిందే. నది మధ్యలో 360 టన్నుల ఇసుక డంప్‌ను కూడా గుర్తించారు. నదీ గర్భంలో భారీ యంత్రాలతో ఇసుక తవ్వకాలు రెండు చోట్ల జరుగుతున్నట్లు తేల్చారు. కేసుల నమోదుకు సిఫార్సు చేశారు. అయినా అక్రమార్కులు తగ్గకపోగా మరింత బరితెగిస్తున్నారని ప్రస్తుత పరిణామాలు తెలియజేస్తున్నాయి.

రోడ్డు నిర్మాణం ఆపేదెవరు?

నదిలో ప్రవాహానికి అడ్డంగా రోడ్డు నిర్మాణ పనులు పట్టపగలే జరుగుతున్నాయి. నిబంధనలకు విరుద్ధమని తెలిసినా అధికారులు ఏమీ చేయలేని నిస్సహాయస్థితిలో ఉన్నారు. ఫిర్యాదు చేసినా చర్యలకు సాహసించడంలేదు. అధికారం ఉంటే ఏదైనా చేయవచ్చు అడ్డు ఉండదని నదిలో జరుగుతున్న రోడ్డు నిర్మాణమే ఒక ఉదాహరణగా ఉంది.

ర్యాంపు నిర్మాణానికి అనుమతి లేదు

కోనూరు వద్ద నదిలో ర్యాంపు నిర్మాణానికి అనుమతి లేదని జిల్లా మైనింగ్ అధికారి నాగిని తెలిపారు. సదరు కాంట్రాక్టర్లను కృష్ణా రివర్ కన్జర్వేటర్, కృష్ణా సెంట్రల్ డివిజన్ విజయవాడ నుంచి అనుమతులు తీసుకోవాలని కాంట్రాక్టర్లు సాయిక్యూ అండ్ సొల్యూషన్స్, గోదావరి కృష్ణా వాటర్ వేస్ అండ్ ట్రాన్స్‌పోర్టు కంపెనీకి లేఖ ద్వారా తెలియజేశామన్నారు. ర్యాంపు నిర్మాణానికి అనుమతి పొందినట్లుగా తమకు ఎటువంటి సమాచారం ఇవ్వలేదని నాగిని చెప్పారు.

పెనుగొండ.. సాహితీకొండ

(5వ పేజీ తరువాయి)

సహ సంపాదకుడిగా 5 పుస్తకాలకు, సంపాదకుడిగా 9 పుస్తకాలకు, గౌరవ సంపాదకుడిగా 76 పుస్తకాలకు వ్యవహరించారు.

మారుమూల పల్లె నుంచి..

పల్నాడు జిల్లా నూజెండ్ల మండలం చెరువుకొమ్ముపాలెంలో 1954 అక్టోబరు 24లో లింగమ్మ, గోవిందరెడ్డి దంపతులకు పెనుగొండ లక్ష్మీనారాయణ జన్మించారు. చెరువుకొమ్ముపాలెం, ఫిరంగిపురంలో ప్రాథమిక విద్యను అభ్యసించారు. ఇంటర్‌మీడియట్ వినుకొండలో, బీఏబీఎల్ గుంటూరు ఆంధ్ర కళాశాలలో చదివారు. 1983లో ఉపాధ్యాయురాలు ఉప్పుటూరి గీతతో ఆయనకు వివాహం జరిగింది. ఆయనకు ఇద్దరు పిల్లలు సంతానం. 1987లో న్యాయవాదిగా ప్రస్థానం మొదలుపెట్టి 1989-90లో గుంటూరు బార్ అసోసియేషన్ కార్యదర్శిగా ఎన్నికైయ్యారు. జీబీఏ సీనియర్ కార్యవర్గ సభ్యుడిగా, అధ్యక్షుడిగా, ఫెడరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారు.

అరసంతో అనుబంధం.. గుర్తింపు

తెనాలిలో 1972లో జరిగిన అరసం జిల్లా మహాసభకు ప్రతినిధిగా పులుపుల వెంకట శివయ్యతో కలిసి పెనుగొండ హాజరయ్యారు. అప్పటి నుంచి అరసంతో ఆయనకు అనుబంధం ఏర్పడింది. 1974లో అరసం జిల్లా కార్యదర్శిగా, అటుపై రాష్ట్ర, జాతీయ కమిటీల్లో కీలక బాధ్యతలు నిర్వహించారు. 2023 ఆగస్టు నుంచి జాతీయ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. అరసం జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైన తొలి తెలుగు సాహితీవేత్తగా ఆయన గుర్తింపు పొందారు.

సమిధ కవితతో సాహితీ ప్రస్థానం

1974లో రచించిన సమిధ కవితతో పెనుగొండ సాహితీ ప్రస్థానం మొదలైంది. ఆ తర్వాత రేపటిలోకి, అనేక, నూరేళ్ల పులుపుల, విదిత, దీపికతో పాటు అనేక రచనలు చేశారు. డాక్టర్ పాపినేని శివశంకర్, వల్లూరి శివప్రసాద్‌లతో కలిసి సహ సంపాదకత్వం, గౌరవ సంపదకత్వం నిర్వహించారు. వీటితో పాటు స్మృతిరేఖలు, స్వయంకృషి, పాన్‌వాలా, గుంటూరు కథలు, వల్లూరి శివప్రసాద్, కనుపర్తి వరలక్ష్మమ్మ కథలు, శశిశ్రీ కథలు, వాసిరెడ్డి సీతాదేవి కథలు, కామ్రేడ్ పులుపుల వెంకటశివయ్య గేయాలు రచించారు.

పురస్కారాలు.. సత్కారాలు

సాహితీ ప్రస్థానంలో పెనుగొండను అనేక పురస్కారాలు వరించాయి. అమర కళాకారుడు సుంకర సత్యనారాయణ పురస్కారం, విశాలాంధ్ర ప్రచురణాలయం స్వర్ణోత్సవ సన్మానం, తెలుగు భాషా పురస్కారం, శ్రీ బొల్లిముంత శివరామకృష్ణ సాహితీ పురస్కారం, విదిత పుస్తకానికి పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం నుంచి సాహితీ సత్కారం, కవి సంధ్య ప్రతిభా పురస్కారం, ఉగాది పురస్కారం, గుత్తికొండ సుబ్బారావు సాహితీ సేవా పురస్కారం అందుకున్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ తోడ్పాటుతో 1997 జనవరి 26 నుంచి 30 వరకు హైదరాబాద్‌లో నిర్వహించిన రచయితల కార్యగోష్టిలో 'తెలుగులో కథా సంకలనాలు-స్థూల పరిశీలన' అనే అంశంపై పెనుగొండ పరిశోధన పత్రం సమర్పించారు. ప్రముఖ కథా రచయిత కాళీపట్నం రామారావు మాస్టారు శ్రీకాకుళం జిల్లాలో కథా నిలయాన్ని ఏర్పాటు చేశారు. ఆంధ్ర విశ్వ కళాపరిషత్తు తెలుగుశాఖ, తెలుగు భాషోద్యమశాఖ తదితర వేదికల నుంచి ప్రశంసా పత్రాలు సమర్పించారు. సాహితీవేత్తలైన పులుపుల వెంకటశివయ్య, కొండేపూటి శ్రీనివాసరావు, విశాల సాహితీ సత్కారం, డాక్టర్ పరుచూరి రాజరామ్, తుమ్మల వెంకట్రామయ్య సాహితీ సత్కారాల్లో ఆయన కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

పలువురి అభినందనలు

పెనుగొండ లక్ష్మీనారాయణరెడ్డి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డుకు ఎంపికవడంపై పాతచెరుకుంపాలెంలో బుధవారం గ్రామస్తులు, బంధు మిత్రులు ఆనందోత్సాహాలు చేసుకున్నారు. పెనుగొండకు కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు రావడం గర్వకారణమని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యేలు భాష్యం ప్రవీణ్, బూర్ల రామాంజనేయులు, గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రం ట్రస్టీ పాశం రామారావు, సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ మాజీ సభ్యుడు లూకా అభినందనలు తెలిపారు. ఆయనకు పురస్కారాన్ని వచ్చే ఏడాది మార్చి 8న అందజేయనున్నారు.

సాగర్ కుడి కాలువలో విద్యార్థి గల్లంతు

మాచర్ల రూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సాగర్ కుడి కాలువలో విద్యార్థి గల్లంతైన సంఘటన బుధవారం మాచర్ల సమీపంలోని బొంబాయి కంపెనీ వద్ద చోటుచేసుకుంది. రెంటచింతల మండలం జెట్టిపాలెం గ్రామానికి చెందిన తాటిమల్ల కోటేశ్వరరావు (15) రెంటచింతలలోని ఓ ప్రైవేటు స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. మాచర్ల మండలం, లింగాపురంలోని తన బంధువుల ఇంటికి బుధవారం వచ్చాడు. మధ్యాహ్నం సమయంలో ఈత కొట్టేందుకు స్నేహితులతో కలిసి పట్టణ శివారులోని బొంబాయి కంపెనీ వద్ద గల కుడికాలువకు వచ్చాడు. ఈత కొట్టేందుకు కాలువలో దిగగా నీటి ప్రవాహానికి కొట్టుకుపోయాడు. విషయం తెలుసుకున్న విద్యార్థి తల్లిదండ్రులు, బంధువులు గాలింపు చేపట్టారు. మాచర్ల రూరల్ పోలీసులు సంఘటనా ప్రాంతానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంగం స్వాధీనం జీవో నం.19 రద్దు

పొన్నూరుటౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సంగం డెయిరీని స్వాధీనం చేసుకోవాలని వైసీపీ తెచ్చిన జీవో 19ని కూటమి ప్రభుత్వం ఉపసంహరించుకుంటూ జీవో నం. 31ని జారీ చేయటంపై రైతుల్లో హర్షం వ్యక్తం అవుతుంది. సంగం డెయిరీలో అక్రమాలు జరిగాయంటూ 2021 ఏప్రిల్ 23న చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర కుమార్, ఎండీ పి. గోపాల కృష్ణను అప్పటి వైసీపీ ప్రభుత్వం ఏసీబీ ద్వారా అరెస్టు చేయించింది. అయితే సంగం డెయిరీలోకి ప్రవేశించడాన్ని ఉద్యోగులు, పాలకవర్గం అడ్డుకున్నారు. దీంతో వైసీపీ పాలకులు జీవో నం.19ని తీసుకొచ్చారు. 1978లో గుంటూరు జిల్లా మిల్క్ ప్రొడ్యూసర్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటీవ్ యూనియన్ లిమిటెడ్ ఆధీనంలో ఉన్న సంగం జాగర్లమూడి డెయిరీ ప్లాంట్‌ను 515 జీవో ద్వారా అప్పటి రాష్ట్ర ప్రభుత్వం గుంటూరు డిస్ట్రిక్ట్ మిల్క్ ప్రొడ్యూసర్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటీవ్ యూనియన్‌కు (సంగం డెయిరీ) అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. తదనంతరం ఈ సంస్థ సంగం మిల్క్ ప్రొడ్యూసర్స్ కంపెనీ లిమిటెడ్‌గా రూపాంతరం చెందింది. అయితే సంగం డెయిరీలో అక్రమాలు జరిగాయంటూ కేసు నమోదు చేసిన ప్రభుత్వం ఏసీబీ ద్వారా అరెస్టు చేయటంతోపాటు సంగం డెయిరీ రోజువారి కార్యకలాపాలు నిర్వహించేందుకు పాలకవర్గంతో సంబంధం లేకుండా తెనాలి సబ్‌కలెక్టర్‌కు ఆస్తుల పరిరక్షణ బాధ్యతలను అప్పగిస్తూ జీవో నం.19ని తీసుకొచ్చింది. ఈ జీవోలో గత 515 జీవోను ఉపసంహరించుకుంటున్నట్లు పేర్కొన్నారు. చైర్మన్ నరేంద్ర కుమార్, ఎండీ గోపాల కృష్ణ జైలులో ఉన్నా, పాలకవర్గ సభ్యులు, రైతులు పోరాటం సాగిస్తూ అప్పట్లో హైకోర్టును ఆశ్రయించారు. జీవో నం.19ని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వుల ద్వారా నిలిపివేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఈ జీవో అంశాన్ని చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ లేఖ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో జీవో నం. 19ని ఉపసంహరించుకుంటూ జీవో నం. 31ని జారీ చేసింది. సంగం పాలకవర్గ సభ్యులు, పాడి రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

21, 22 తేదీల్లో 'వివా వీవీఐటీ' 2కే24-25



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని, విద్యాసాగర్

పెదకాకాని, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో ఈ నెల 21, 22 తేదీల్లో జాతీయ స్థాయి యువజనోత్సవం 'వివా వీవీఐటీ 2కే24-25' నిర్వహించనున్నట్లు వీవీఐటి కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ తెలిపారు. వసుధైక కుటుంబాన్ని ప్రతిబింబించేలా భూమిపై అన్ని జీవరాసులు ఒకే కుటుంబం అనే ఆలోచన చాటేలా 'ది వరల్డ్ ఈజ్ వన్' నేపథ్యంలో ఈ యువజనోత్సవాన్ని నిర్వహించనున్నారు. స్టూడెంట్ యాక్టివిటి కౌన్సిల్ (శాక్) విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించు ఈ వేడుకలో విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకత, నైపుణ్యం, కళాత్మకతను వెలికితీసే విధంగా సాంకేతిక, క్రీడా, సాంస్కృతిక విభాగాల్లో 93 అంశాలలో పోటీలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ యువజనోత్సవానికి సంబంధించిన ప్రచార ప్రతులను విద్యార్థులతో కలసి కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కళాశాల సందర్శనలో విడుదల చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ వై.మల్లికార్జునరెడ్డి, డీన్ ఆఫ్ ఎకడమిక్స్ కె.గిరిబాబు పాల్గొన్నారు. వీవీఐటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ 21, 22 తేదీల్లో యువజనోత్సవం, 23న కళాశాల వార్షికోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. వివా వీవీఐటీ కన్వీనర్ కె.గిరిబాబు మాట్లాడుతూ యువజనోత్సవంలో పాల్గొనే విద్యార్థులు 'వివావీవీఐటీ.కామ్' వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. పాల్గొనే విద్యార్థులకు గుంటూరు, విజయవాడ, తెనాలి నుంచి రవాణా సౌకర్యాలు ఏర్పాటు చేశామని తెలిపారు.

4,162 క్వింటాళ్ల బియ్యం వేలం

- రూ. 1.34 కోట్లకు విక్రయం

నరసరావుపేట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): బ్లాక్ మార్కెట్‌లో స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం నిల్వలకు వేలం నిర్వహించారు. కలెక్టరేట్‌లో బుధవారం జరిగిన వేలంలో వ్యాపారులు పాల్గొన్నారు. 4,162 క్వింటాళ్ల బియ్యం నిల్వలకు వేలం జరగ్గా రూ 1.34 కోట్లకు వ్యాపారులు కొనుగోలు చేశారు. 2022 నుంచి వివిధ ప్రాంతాల్లో స్వాధీనం చేసుకున్న నిల్వలను ఎంఎల్‌ఎస్ పాయింట్‌లు, మిల్లుల్లో నిల్వ చేశారు. ఎంఎల్‌ఎస్ పాయింట్‌లలో ఉన్న 770 క్వింటాళ్లకు వేలం నిర్వహించగా కిలో రూ.35.60 చొప్పున గణపవరంకు చెందిన జి.శ్రీనివాసరావు కొనుగోలు చేసినట్టు జిల్లా పౌర సరఫరా అధికారి నారధముని తెలిపారు. జిల్లాలోని వివిధ రైస్ మిల్లుల్లో నిల్వ ఉంచిన 3392 క్వింటాళ్లకు వేలంలో కె.శ్రీనివాసరావు కిలో రూ. 31.70 చొప్పున కొనుగోలు చేశారు. 770 క్వింటాళ్లకు రూ.27.49 లక్షలు, 3392 క్వింటాళ్లకు రూ.1.07 కోట్లు మొత్తం రూ. 1.34 కోట్లు ప్రభుత్వానికి ఆదాయం లభించింది. ఆయా నిల్వలను సదరు వ్యాపారులకు అప్పగించనున్నట్లు డీఎస్‌వో తెలిపారు.

నకిలీ సర్టిఫికెట్లపై ఫిర్యాదు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పెదకాకాని, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో నకిలీ సర్టిఫికెట్ల రాకెట్ వెనుక వర్సిటీ ఉన్నతాధికారుల పాత్ర ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. 15 రోజుల క్రితం వర్సిటీలో నకిలీ సర్టిఫికెట్ల వ్యవహారం వెలుగు చూడగా, దానికి సంబంధించి స్పాట్ అడ్మిషన్ డైరెక్టర్ బ్రహ్మాజీరావు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ శివప్రసాద్ తదితరులు సీరియస్‌గా తీసుకొని వర్సిటీ ఉన్నతాధికారి దృష్టికి తీసుకెళ్లారు. అయితే సదరు అధికారి మాత్రం వర్సిటీలో ఇవన్నీ కామనేననీ, ప్రతి ఏడాది 30 నుంచి 40 ఫేక్ సర్టిఫికెట్లు వస్తూనే ఉంటాయని వ్యాఖ్యానించినట్లు తెలిసింది. ఆంధ్రజ్యోతిలో ఈ నెల 15న 'వర్సిటీలో... సర్టిఫికేట్లు' శీర్షికన కథనం వెలువడిన విషయం విదితమే. దీనికి ఎట్టకేలకు వర్సిటీ అధికారులు స్పందించారు. పీజీ స్పాట్ అడ్మిషన్స్‌లో వెలుగు చూసిన నకిలీ సర్టిఫికెట్ల వ్యవహారంపై సమగ్రంగా దర్యాప్తు చేయాలని పెదకాకాని పోలీసులకు వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం ఫిర్యాదు చేశారు. వర్సిటీకి సంబంధం లేని ఫేక్ సర్టిఫికెట్లను కొందరు విద్యార్థులు తీసుకొచ్చి పీజీలో అడ్మిషన్ పొందేందుకు ప్రయత్నించారు. అయితే ఆ సర్టిఫికెట్లు వర్సిటీ నుంచి జారీ అయినట్లుగా, అదేవిధంగా జారీ చేసిన సమయంలో వర్సిటీ సంబంధిత విభాగంలో ఎవరైతే ఉన్నారో ఆ అధికారుల సంతకాలు మాత్రమే వాటిపై ఉన్నాయి. ఇవి వర్సిటీ అధికారులు పెట్టిన సంతకాలేనా లేక ఫేక్ సంతకాలా అనేది ప్రశ్నార్థకంగా మారింది. పెదకాకాని పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసిన సీఐ నారాయణస్వామి బుధవారం యూనివర్సిటీలోని విభాగాలను సందర్శించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.10
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	101,109,120
చికెన్ విత్ స్కిన్	194.00
చికెన్ స్కిన్ లెస్	204.00

50,966 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 53,365 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 50,966 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 48,532 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	7500	14500	334	7500	14500
నెంబరు. 5	8000	12000	నెంబరు.5	8000	12500
273	--	--	273	11000	12000
341	8500	15000	341	8000	13000
4884	13000	13000	4884	11000	11000
సూపర్ 10	--	--	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	7800	16300	తేజ	7500	16500
బ్యాడిగి	7500	13200	బ్యాడిగి	8000	12500
దేవనూరు డీలక్స్	9000	14500	దేవనూరు డీలక్స్	9500	12000
తెల్లకాయలు	4000	11000	తెల్లకాయలు	4500	10000

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

నేడు చాగంటివారిపాలెం ఊర చెరువు వేలం

ముప్పాళ్ళ, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని చాగంటివారిపాలెంలో ఉన్న ఊర చెరువుకు ఈనెల 19వ తేదీ వేలం పాట నిర్వహించనున్నట్టు పంచాయతీ కార్యదర్శి శివపార్వతి బుధవారం తెలిపారు. సుమారు ఐదెకరాల విస్తీర్ణం గల చెరువుకు వేలం నిర్వహిస్తున్నామని, ఉదయం 10 గంటలకు వేలం పాట ప్రారంభమవుతుందన్నారు. ఆసక్తి గల వారు పంచాయతీ వారు నిర్ణయించిన దరఖాస్తు రుసుంను ముందుగా చెల్లించి వేలంలో పాల్గొనాలని తెలిపారు. రెండు సంవత్సరాల పాటు వేలం పాట పాడుకున్న వారికి చెరువును లీజుకు ఇస్తారన్నారు.

ఒకే దేశం.. ఒకే విద్య అమలు చేయాలి



గాంధీ బొమ్మ వద్ద మౌనదీక్షలో కూర్చున్న బాలగంగాధరరెడ్డి

పిడుగురాళ్ల, డిసెంబరు 18 (ఆంధ్ర జ్యోతి): ఒకే దేశం.. ఒకే విద్య.. ఒకే వైద్యం... ఒకే తాగునీరును ప్రధాన మంత్రి మోదీ అమలు చేయాలని కోరుతూ పట్టణానికి చెందిన సామాజిక కార్యకర్త ముత్యం బాలగంగాధర రెడ్డి రెండు రోజులుగా ఆర్ అండ్‌బీ బంగ్లా వద్ద ఉన్న గాంధీ విగ్రహం వద్ద మౌనదీక్ష చేపట్టారు. విద్య, వైద్యం, తాగునీరు ఉచితం అంటూ ప్రైవేటు విద్య, ప్రైవేటు వైద్యం, తాగునీరుకు డబ్బులు అంటూ రెండు రకాల పద్ధతులను అవలంబిస్తున్నారని, దేశం మొత్తం ఒకే విద్య, ఒకే వైద్యం, ఒకే తాగునీరు మోదీ అమలు చేయాలని బాలగంగాధరరెడ్డి మౌనదీక్ష చేపట్టారు.

ఖోఖో టీమ్‌కు తిరుమల ఆక్స్‌ఫర్డ్ డిగ్రీ విద్యార్థిని



పిడుగురాళ్ల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట విక్టరీ డిగ్రీ కళాశాలలో యూనివర్సిటీ స్థాయి ఖోఖో పోటీలు బుధవారం జరిగాయి. పిడుగురాళ్ల తిరుమల ఆక్స్‌ఫర్డ్ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ చదువుతున్న విద్యార్థిని కన్నా త్రిష అత్యుత్తమ ప్రతిభ కనబరిచి నాగార్జున యూనివర్సిటీ తరఫున జట్టుకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ పి.ఫణికిషోర్‌బాబు తెలిపారు. ఈ నెల 28, 29 తేదీలలో కేరళ రాష్ట్రంలోని పుట్టిలో జరుగబోయే సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ ఖోఖో పోటీల్లో కన్నా త్రిష పాల్గొనే అవకాశం ఉన్నట్లు తిరుమల ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థల డైరెక్టర్ బొల్లా గిరిబాబు, ప్రిన్సిపాల్ నరేష్, పీడీ నాగరాజు, వేణుగోపాల్, రాజు, విద్యార్థులు, అధ్యాపకులు త్రిషను అభినందించారు.

చౌక డిపో కాటాల తనిఖీ

కారంపూడి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చౌక డిపో కాటాలను బుధవారం తూనికల శాఖ అధికారులు తనిఖీ చేశారు. చౌక డిపో డీలర్లు తమ కాటాలను అధికారుల వద్దకే తీసుకువచ్చారు. అయితే తూనికల అధికారుల రాకతో పట్టణంలోని వ్యాపారులు బెంబేలెత్తిపోయారు. దుకాణాలను మూసివేశారు.

బార్ అండ్ రెస్టారెంట్లకు దరఖాస్తులు

మాచర్ల రూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మాచర్ల పట్టణంలో మూడు బార్ అండ్ రెస్టారెంట్లకు దరఖాస్తులు కోరుతున్నట్లు ఎక్సైజ్ సీఐ వెంకటరమణ బుధవారం తెలిపారు. ఆసక్తి గల వారు ఈనెల 23వ తేదీ మధ్యాహ్నం 3 గంటల కల్లా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరింత సమాచారం కోసం పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

గృహంలో చోరీ

రూ.11వేలు.. కేజీ వెండి అపహరణ

సత్తెనపల్లి రూరల్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలం లోని వెన్నాదేవిలో ఒక గృహంలో రూ.11వేలు నగదు, కేజీ వెండి ని దొంగలు దోచుకెళ్లారు. ఈ ఘటనకు సంబంధించి రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన పుల్లెల మార్కండేయులు కర్నాటకలోని బళ్లారి వద్ద వ్యవసాయం చేస్తూ జీవిస్తుంటాడు. వెన్నాదేవిలోని స్వగ్రామానికి కుటుంబసభ్యులందరూ నెలకు ఒకసారి వచ్చి ఒకటి రెండు రోజులు ఉండి వెళ్తుంటారు. ఈ క్రమంలో పక్క గృహం వారు మంగళవారం ఉదయం మార్కండేయులు గృహం తలుపులు పగుల గొట్టి ఉండటం గమనించి అతనికి ఫోన్ ద్వారా సమాచారం అందజేశారు. మార్కండేయులు ఇంటికి వచ్చి చూడగా దుస్తులు, గృహోపకరణాలు చిందరవందరగా పడిఉండటం, ఇంట్లో ఉన్న రూ.11 వేలు నగదు, కేజీ వెండి అపహరించుకుపోయినట్లు గుర్తించి బుధవారం రూరల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ సీఐ పీ శ్రీనివాసరావు తెలిపారు.

వ్యక్తిగత కక్షలతో దాడి

రాజుపాలెం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత కక్షలతో ఒకరిపై మరొకరు గొడ్డలితో దాడిచేసిన సంఘటన మండలంలోని నెమలిపురి గ్రామంలో మంగళవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నెమలిపురి గ్రామానికి చెందిన కంకణంపాటి మారుతీకృష్ణకు అదే గ్రామానికి చెందిన ముప్పాళ్ల బాలకృష్ణకు ఆరునెలల క్రితం గొడవ జరిగింది. దానిని మనసులో ఉంచుకున్న బాలకృష్ణ మంగళవారం రాత్రి మారుతీకృష్ణపై గొడ్డలితో దాడి చేశాడు. ఈ ఘటనలో మారుతీకృష్ణ తలకు, ఎడమ చేతికి గాయాలయ్యాయి. మారుతీ కృష్ణ ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్ఐ వేణుగోపాల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రూరల్ పోలీసు స్టేషన్ తనిఖీ

సత్తెనపల్లి రూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వార్షిక తనిఖీల్లో భాగంగా సత్తెనపల్లి రూరల్ పోలీసుస్టేషన్‌ను డీఎస్పీ ఎం హనుమంతరావు బుధవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదుదారులతో మంచిగా మెలగాలని, ప్రజలపై పోలీసుశాఖలో విశ్వాసం కలిగేలా పని చేయాలని సీఐ పీ శ్రీనివాసరావుకు, సిబ్బందికి సూచించారు. స్టేషన్ సిబ్బందికి పలు సూచనలు చేశారు.

నిధుల కొరతతో ఆగిన పాఠశాల నిర్మాణాలు

● రెండేళ్లకు పైగా నిలిచిన నాడు-నేడు పనులు
● కూటమి ప్రభుత్వంపైనే ఆశలు



అసంపూర్తిగా నిర్మాణంలో ఉన్న లెనిన్‌నగర్‌లోని జడ్పీ పాఠశాల



అద్దెభవనంలో కొనసాగుతున్న జమున స్కూల్

పిడుగురాళ్ల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యాభివృద్ధికి తానెంతో కట్టుబడి ఉన్నాననే ఆర్భాటపు ప్రకటనలతో గత ప్రభుత్వం అట్టహాసంగా నాడు-నేడు పనులను ప్రవేశపెట్టి రెండు దశల్లో పాఠశాల నిర్మాణాలకు, ఆధునీకరణకు కొన్ని పాఠశాలలను ఎంపిక చేశారు. తొలివిడతగా గురజాల డివిజన్‌లో 70కి పైగా పాఠశాలల్లో అదనపు తరగతి గదులు, ప్రహరీ నిర్మాణాలు, పాఠశాలల్లో తరగతి గదులు, మౌలిక వసతుల నిర్మాణానికి ప్రభుత్వం పాఠశాల స్థాయిని బట్టి 35 నుంచి కోటి రూపాయల వరకు నిధులను జీవో రూపంలో మంజూరు చేశారే తప్ప ఆ స్థాయిలో నిధులు మాత్రం పాఠశాల కమిటీలకు, కాంట్రాక్టర్లకు జమకాలేదు. దీంతో పల్నాడులోని లెనిన్‌నగర్, జానపాడుతో పాటు మరికొన్ని జడ్పీ పాఠశాలలు, ప్రాథమికోన్నత పాఠశాలల్లోనూ అదనపు తరగతి గదులు, మరుగుదొడ్ల నిర్మాణాలన్నీ అసంపూర్తిగానే మిగిలిపోయి ఉన్నాయి. గత ప్రభుత్వం ఆర్భాటపు ప్రకటనలతో సరిపెట్టి నిధులు విడుదల చేయక పోవడంతో సంబంధిత పాఠశాల కమిటీ, కాంట్రాక్టర్లు ఆర్థిక సమస్యలతో పనులు కొనసాగించేలా రెండేళ్లుగా ఎక్కడి పనులు అక్కడే నిలిపివేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాకనైనా నిధులు మంజూరవుతాయేమోనని ఎంతో ఆశతో ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఆయా గ్రామాల ప్రజలు ఎదురు చూస్తున్నప్పటికీ నేటి వరకు నాడు-నేడు పథకం కింద అసంపూర్తిగా నిర్మాణంలో ఉన్న పాఠశాలలపై కూటమి ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకోకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయి ఉన్నాయి. పట్టణంలోని జమున స్కూల్ శిథిలావస్థకు చేరుకోవడంతో పాఠశాల భవనాన్ని పూర్తిగా తొలగించి సమీపంలో అద్దె భవనాల్లో కొనసాగిస్తూ అద్దెలు చెల్లించలేక పాఠశాల ఉపాధ్యాయ బృందం దాతల సాయాన్ని కోరుతూ ఉంది.



అర్థాంతరంగా నిర్మాణం నిలిచిన పిడుగురాళ్ల ఎల్ఈ స్కూల్

ఇసుక కొరత కూడా కారణం

నాడు - నేడు పథకం పనులకు సంబంధించి కొన్ని పాఠశాలలకు కొంతమేర నిధులు ఉన్నప్పటికీ ఇసుకను ప్రభుత్వమే సరఫరా చేయాల్సి ఉండటంతో ఆ మేరకు నిర్మాణాలకు అడ్డంకిగా మారింది. కొన్ని సార్లు సంబంధిత అధికారులను పనుల కొనసాగింపునకు వీలుగా ఇసుకను సరఫరాచేయాలని రాతపూర్వకంగా కోరినప్పటికీ సంబంధిత అధికారుల నుంచి ఎటువంటి సమాధానం రాలేదు. ఇసుక సరఫరా చేయడంతో పాటు అసంపూర్తిగా నిర్మాణంలో ఉన్న పాఠశాలలను పూర్తి చేసేందుకు ఇకనైనా కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందని ఉపాధ్యాయులు, గ్రామస్థులు, విద్యార్థులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

విద్యార్థులకు అసౌకర్యంగా ఉంది

● ఎన్ నాగేశ్వరరావు, హెచ్ఎం



పాఠశాల నూతన గదుల నిర్మాణానికి నిధులు, ఇసుక కొరత ఉండటం వల్ల ఏడాదికి పైగా లెనిన్ నగర్ జడ్పీ హైస్కూల్ నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోవడంతో విద్యార్థులకు ఎంతో అసౌకర్యంగా ఉంది.

టీడీపీ హయాంలోనే గ్రామాల అభివృద్ధి

● ఎమ్మెల్యే బాష్యం ప్రవీణ్ ● బాలెమర్రులో మాజీసర్పంచ్, ఎన్టీఆర్ విగ్రహాల ఆవిష్కరణ



బాలెమర్రు గ్రామంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

క్రోసూరు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం ప్రభుత్వం ఆధ్వర్యంలోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమైందని ఎమ్మెల్యే బాష్యం ప్రవీణ్ అన్నారు. బుధవారం మండలంలోని బాలెమర్రు గ్రామంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులను అడిగి సమస్యల గురించి విచారించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గ్రామాల్లో అంతర్గత రహదారుల అభివృద్ధికి శ్రీకారం చుట్టారన్నారు. ఐదు సంవత్సరాల వైసీపీ పాలనలో గ్రామాల్లో మౌళిక వసతులు పూర్తిగా కరువై పోయాయన్నారు. నియోజకవర్గంలో గ్రామీణాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తామని అన్నారు. రైతులకు గిట్టుబాటు ధరలు, తాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధి వేగంగా జరుగుతున్నాయన్నారు. ఐదు సంవత్సరాల వైసీపీ పాలనలో నీటి సంఘాలకు ఎన్నికలు జరగకుండా కాలువలు బాగు చేయకుండా రైతుల పంటలు ఎండిపోవటానికి కారకులయ్యారన్నారు. ప్రస్తుతం ఎన్నికైన సాగునీటి సంఘాల అధ్యక్షులు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుల ఆధ్వర్యంలో కాలువలకు మరమ్మతులు నిర్వహించి ప్రతి ఎకరాకు సాగు నీరు ఇస్తామన్నారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ దిగుమర్తి అప్పారావు, అందుకూరు మాజీ సర్పంచ్ తాళ్ళూరి శ్రీనివాసరావు, మన్నెం శ్రీనివాసరావు, లక్ష్మీనారాయణ, వాసిరెడ్డి వీరభద్రం, దుద్దుల యోహాన్, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నలజాల సదాశివరావు, కొండవీటి శ్రీనివాసరావు, గుడిపాడు బాషా, డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడు ధూళ్ళ సాంబశివరావు, అనుముల వెంకట రామిరెడ్డి, గాదె సూర్యనారాయణ, తోక వెంకటరావు తదితరులు పాల్గొనారు.

మాజీ సర్పంచ్, ఎన్టీఆర్ విగ్రహాల ఆవిష్కరణ

బాలెమర్రు గ్రామంలో మాజీ సర్పంచ్ ముసులూరి కోటేశ్వరరావు, ఎన్టీ రామారావు విగ్రహాలను బుధవారం ఎమ్మెల్యే ప్రవీణ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోటేశ్వరరావు సర్పంచ్‌గా బాలెమర్రు గ్రామ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేశారన్నారు. గ్రామంలో ఆయన విగ్రహంతో పాటు ఎన్టీఆర్ విగ్రహాన్ని కూడా ఆవిష్కరించు కోవటం సంతోషంగా ఉందన్నారు.

రైతులకు సాగునీటి కొరత లేకుండా చూడాలి

బెల్లంకొండ, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): సకాలంలో రైతులకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ప్రవీణ్ సూచించారు. బుధవారం ఉదయం గుంటూరు ఎమ్మెల్యే కార్యాలయంలో నూతనంగా ఎంపికైన సాగునీటి సంఘం అధ్యక్షుడు షేక్ ముస్తఫా ఎమ్మెల్యే ప్రవీణ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బెల్లంకొండ ఎర్రబాలెం మేజరుకు గతంలో గండిపడి రైతులకు తీవ్ర నష్టం జరిగిందని, నూతనంగా ఎంపికైన సాగునీటి సంఘం అధ్యక్షులు, సభ్యులు కాలువలను పటిష్ఠ పరిచేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. గుంటూరు మిర్చియార్డు మాజీ చైర్మన్ వెన్నా సాంబశివారెడ్డి ముస్తఫాను శాలువాతో సత్కరించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో టీడీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్, బెల్లంకొండ సర్పంచ్ జ్యోతి సముద్రం తదితరులు పాల్గొన్నారు.

మంత్రి గొట్టిపాటికి ఎమ్మెల్యే వినతి

పెదకూరపాడు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను ఎమ్మెల్యే బాష్యం ప్రవీణ్ కలసి వినతిపత్రం అందించారు. తాడేపల్లిలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో బుధవారం కలసి పెద కూరపాడు నియోజకవర్గంలో విద్యుత్ వ్యవస్థను మెరుగుపరిచేందుకు అదనంగా సౌకర్యాలు కల్పించాలని కోరారు. విద్యుత్ సమస్యలపై మంత్రితో చర్చించినట్టు తెలిపారు. సమస్యలపై మంత్రి సానుకూలంగా స్పందించారని ఆయన అన్నారు.

శ్రీమాత జగదాంబ, సేవాలాల్ ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

మాచర్ల రూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విజయపురిసౌత్‌లో గల దేశవరం క్యాంపు తండాలో ఉన్న శ్రీ మాతా జగదాంబ, అభయాంజనేయస్వామి, సద్గురు సేవాలాల్ మహరాజ్ ఆలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు బధవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యేకి ఆలయ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక జీవితాన్ని గడపాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ధారునాయక్, శేర్రెడ్డి గోపిరెడ్డి, పంగులూరి పుల్లయ్య, మండల అధ్యక్షుడు నేరేటి వీరాస్వామి యాదవ్, బొల్లా వెంకటేశ్వర్లు చౌదరి, ఆదెపు కోటయ్య, రామ్‌చంద్‌నాయక్, మైలపల్లి అప్పలరాజు, సత్తిబాబు, ఎరుపల్లి వెంకటేశ్వర్లు, డాక్టర్ బసివిరెడ్డి, గంటా ధనుంజయరావు, వస్తుపురి శ్రీరామ్మూర్తి, పరమేశ్వరరావు, ఎమ్మార్పీఎస్ నేత ఊరే మార్కు, మస్తాన్, నరసింహులు, హాతీరామ్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

పశుగ్రాస సాగును రైతులు సద్వినియోగించుకోవాలి

● పశు సంవర్ధకశాఖ జిల్లా అధికారి కాంతారావు

నకరికల్లు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా రైతులు పశుగ్రాసాల సాగును చేపట్టి ఉపయోగించుకోవాలని పల్నాడు జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కే కాంతారావు రైతులకు సూచించారు. మినీ గోకులం నిర్మాణాలకు ఎంపికైన లబ్ధిదారులు నిర్మాణాలను చేపట్టి త్వరగా పూర్తి చేయాలని కోరారు. బుధవారం ఆయన నకరికల్లు మండలం గుండ్లపల్లి, బాలాజీనగర్ తండా, నకరికల్లు గ్రామాల్లో పర్యటించారు. 21వ జాతీయ పశుగణన సర్వే కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో ఆయన పరిశీలించారు. 44శాతం సర్వే పూర్తయినట్టు తెలిపారు. గుండ్లపల్లిలో నిర్మాణంలో ఉన్న మినీ గోకులం షెడ్డును పరిశీలించారు. రైతులంతా పశు సంవర్ధకశాఖ ద్వారా అందిస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో నకరికల్లు ఏడీ డాక్టర్ వెంకటేశ్వర్లునాయక్, సిబ్బంది సూర్యారావు, సలీం పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

నకరికల్లు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రైతుల భూ సమస్యలను పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ కే పుల్లారావు తెలిపారు. బుధవారం కుంకలగుంటలో రెవెన్యూ సదస్సు గ్రామసభ నిర్వహించారు. 16 దరఖాస్తులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో డీటీ శ్రీనివాసరావు, ఈవో వెంకయ్య, వీఆర్‌వో జీ విష్ణువర్ధన్‌రెడ్డి, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

దాచేపల్లి: గ్రామాల్లో జరుగుతున్న రెవెన్యూ సదస్సులను ఉపయోగించుకోవాలని దాచేపల్లి తహసీల్దార్ వైవీ కుటుంబరావు బుధవారం తెలిపారు. రెవెన్యూ సదస్సులో భాగంగా నడికూడి గ్రామ పంచాయతీ కార్యాలయంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో 30 అర్జీలు వచ్చినట్లు వివరించారు. ప్రధానంగా ఆన్‌లైన్‌లో 1-బీ, అడంగల్ కాపీల మార్పుపై దరఖాస్తులు అధికంగా వచ్చినట్లు తెలిపారు. వచ్చిన అర్జీలను తక్షణమే పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. రెవెన్యూ సదస్సులో దేవదాయ శాఖ ఈవో నెమలిరెడ్డి, డీటీ రాజు పాల్గొన్నారు.



కుంకలగుంటలో రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్

క్రోసూరు: రైతులు తమ సమస్యలను సదస్సుల దృష్టికి తీసుకు వచ్చి తక్షణమే పరిష్కరించుకోవాలని డీటీ శ్రీనివాస్ అన్నారు. దొడ్లేరులో జరిగిన రైతు సదస్సులో ఆయన మాట్లాడారు. ఎనిమిది అర్జీలు తమకు అందినట్టు ఆయన తెలియజేశారు. కొన్ని సమస్యలను తక్షణమే పరిష్కరించినట్టు తెలిపారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, సర్వేయర్లు, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలి

● ఎంపీడీవో సరోజనీదేవి

రెంటచింతల, డిసెంబర్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలు 2030లోగా సుస్థిర అభివృద్ధి సాధించే విధంగా ప్రణాళికలు తయారు చేయాలని ఎంపీడీవో కె.సరోజనీదేవి కోరారు. మూడో రోజైన బుధవారం సుస్థిర అభివృద్ధి శిక్షణలో భాగంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీల అభివృద్ధికి సర్పంచులు కార్యదర్శులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఐక్యరాజ్యసమితి తీర్మానాలకు అనుగుణంగా రూపొందించిన తొమ్మిది అంశాల్లో ప్రతి పంచాయతీ అభివృద్ధి చెంది ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపర్చాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, ఏఈలు, సర్పంచులు, అంగన్‌వాడీ సిబ్బంది, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సత్తెనపల్లి రూరల్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్‌లో భాగంగా చేపట్టిన ఎల్ఎస్‌డీజీ శిక్షణా కార్యక్రమం బుధవారం ముగిసింది. ఈ నెల 12వ తేదీ నుంచి మండల పరిషత్ కార్యాలయ సమావేశపు హాల్లో మొత్తం మూడు బ్యాచ్‌లకు శిక్షణ ఇచ్చారు. శిక్షణలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాల గురించి వివరించారు. ఎంపీడీవో బీ శ్రీనివాసరెడ్డి, ఈవోపీఆర్‌డీ ఏ శ్రీనివాసరెడ్డి, వివిధ శాఖల అధికారులు ఈ శిక్షణలో పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఎస్టీయూ నిరంతర పోరాటం

● రాష్ట్ర కౌన్సిలర్ గేరా మోహనరావు

నకరికల్లు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం నిరంతరం పోరాటం కొనసాగిస్తోందని ఆ శాఖ రాష్ట్ర కౌన్సిలర్ గేరా మోహనరావు అన్నారు. బుధవారం ఎస్టీయూ నకరికల్లు మండలశాఖ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మోహనరావు మాట్లాడుతూ 78 సంవత్సరాలుగా ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి పోరాడుతున్న ఏకైక సంఘం ఎస్టీయూ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్థికశాఖ కార్యదర్శి ఏమండి, నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, సుందరరావు, షేక్ గౌస్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి


● డీఎస్పీ హనుమంతరావు

సత్తెనపల్లి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రీడలపై ఆసక్తిని పెంపొందించుకొని విద్యతో పాటు క్రీడల్లోను రాణించాలని డీఎస్పీ హనుమంతరావు అన్నారు. స్థానిక ఆక్స్‌ఫర్డ్ స్కూల్లో బుధవారం స్పోర్ట్స్‌డే నిర్వహించారు. ఈ వేడుకలను ప్రారంభించిన హనుమంతరావు మాట్లాడుతూ క్రీడాకారులను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. కార్యక్రమంలో రూరల్ సీఐ శ్రీనివాసరావు, ఆక్స్‌ఫర్డ్ స్కూల్ నిర్వాహకులు పాల్గొన్నారు.

డీసీ అధ్యక్షుడికి సన్మానం

సత్తెనపల్లి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడిగా ఎన్నికైన గుంటూరు రమేష్‌ను బుధవారం టీడీపీ నేత మన్నెం శివనాగమల్లేశ్వరరావు పలువురు పూలమాలలు వేసి సత్కరించారు. రమేష్ నాయకత్వంలో కాలువల అభివృద్ధి జరుగుతుందని ఆకాంక్షించారు.

కరాటేలో రెండో స్థానంలో రోహితా రెడ్డి



కోచ్ కీర్తన్ నుంచి అవార్డును అందుకుంటున్న రోహితారెడ్డి

రెంటచింతల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): అండర్ 13కు సంబంధించి ఢిల్లీలోని తల్కటోరా స్టేడియంలో ఈనెల 13 నుంచి 17 వరకు కరాటే పోటీలు నిర్వహించగా ఆ పోటీల్లో రెంటచింతలకు చెందిన రోహితారెడ్డి ఆలిండియా స్థాయిలో రెండో బహుమతిని సాధించినట్లు కోచ్ కీర్తన్ ఆంధ్రజ్యోతికి ఫోన్ ద్వారా తెలిపారు. ఈ మేరకు సిల్వర్ మెడల్‌ను బుధవారం జరిగిన కార్యక్రమంలో ప్రదానం చేశారు. రోహితారెడ్డి హైదరాబాద్‌లోని వీఆర్‌ఎస్ విజ్ఞాన్‌జ్యోతి పాఠశాలలో 7వ తరగతి చదువుతుంది.

● టీడీపీ సీనియర్ నేత గొంటు ఆదిరెడ్డి మనుమరాలు రోహితా రెడ్డి కరాటే పోటీలో రెండో బహుమతిని కైవసం చేసుకోవడంతో ఎమ్మెల్యేలు యరపతినేని, జూలకంటి, రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ మంజులారెడ్డి ఫోన్ ద్వారా అభినందనలు తెలిపారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

● మాడుగుల పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రదీప్

గురజాలటౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతోపాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటేనే అనారోగ్యాలు రాకుండా ఉంటాయని మాడుగుల పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రదీప్ అన్నారు. శుక్రవారం ఆయనతో ఆంధ్రజ్యోతి ఫటాఫట్..

ఫటా ఫట్



ప్ర: పీహెచ్‌సీ పరిధిలో ఎటువంటి కేసులు నమోదవుతున్నాయి?

జ: జ్వరాలు, వైరల్ ఫీవర్లు నమోదవుతున్నాయి. రోజుకు 60 దాకా ఓపీ వస్తుంది.

ప్ర: పీహెచ్‌సీలో సిబ్బంది కొరత ఉందా?

జ: సిబ్బంది కొరత లేదు. అన్ని పోస్టులు భర్తీ అయ్యాయి.

ప్ర: పీహెచ్‌సీలో సరిపడా మందులు ఉన్నాయా?

జ: పీహెచ్‌సీలో 104 రకాల మందులు, 74 టెస్టులు అందుబాటులో ఉన్నాయి. ఉపకేంద్రంలో కూడా 14 రకాల టెస్టులు, 100 రకాల మందులు అందు బాటులో ఉన్నాయి.

ప్ర: పీహెచ్‌సీలో ఎటువంటి వైద్య సేవలందిస్తున్నారు?

జ: కాన్పులు, ఇతరత్రా సేవలు చేస్తున్నాం. కుటుంబ నియంత్రణ, శస్త్ర చికిత్సల కోసం గురజాల ప్రభుత్వ వైద్యశాలకు రిఫర్ చేస్తున్నాం.

న్యూకేటగిరిలో బాపట్ల జిల్లా ఎడ్లజత ప్రథమం



ప్రథమస్థానం సాధించిన బాపట్ల జిల్లా ఎడ్లజత

గురజాలటౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీపాత పాటేశ్వరి అమ్మవారి తిరునాళ్లను పురస్కరించుకొని నిర్వహిస్తున్న జాతీయస్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బలప్రదర్శన పోటీల్లో భాగంగా బుధవారం న్యూకేటగిరి విభాగంలో పోటీలు జరిపారు. ఈ పోటీల్లో బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలెంకు చెందిన అత్తోట శిరీషాచౌదరి, శివకృష్ణచౌదరి ఎడ్లజత నిర్ణీత సమయంలో 5800 అడుగుల దూరం పందెపు బండను లాగి ప్రథమస్థానంలో నిలిచింది. అలాగే తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌కు చెందిన రోహన్‌బాబు ఎడ్లజత 5600 అడుగులతో రెండోస్థానం, గుంటూరు జిల్లా మేడికొండూరు మండలం పాలడుకు చెందిన వెదుళ్లపల్లి శ్రీనివాసరావు ఎడ్లజత 5012.9 అడుగులతో మూడోస్థానం, పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం కొమెరపూడి గ్రామానికి చెందిన యర్రా యేసుబాబు చౌదరి ఎడ్లజత 4800 అడుగులతో నాలుగోస్థానం, పల్నాడు జిల్లా క్రోసూరు మండలం ఉయ్యందనకు చెందిన సంపటం వీరబ్రహ్మనాయుడు ఎడ్లజత 4783.6 అడుగులతో ఐదోస్థానంలో నిలిచాయి. కమిటీ సభ్యులు తెన్నేటి బుచ్చిబాబు, నల్లా లక్ష్మయ్య, నెల్లూరి మల్లయ్య, నాగేశ్వరరావు, విశ్వనాథం, చలవాది శ్రీనివాసరావులు పోటీలను పర్యవేక్షించారు.

అభివృద్ధికి కేరాఫ్ ఆంధ్రప్రదేశ్ : ధారూనాయక్

మాచర్ల రూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధికి కేరాఫ్‌గా ఆంధ్రప్రదేశ్ నిలిచిందని టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం ధారూనాయక్ అన్నారు. బుధవారం మండలంలోని విజయపురిసౌత్‌లో ఉన్న దేశవరపు క్యాంపు తండాలో శ్రీమాతా జగదాంబ, అభయాంజనేయస్వామి, సద్గురు సేవాలాల్ మహరాజ్ ఆలయ ప్రథమ వార్షికోత్సవంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని దోచుకొని అట్టడుగుకు చేర్చారన్నారు. రాష్ట్ర ప్రజలు అభివృద్ధికి ఓటు వేసి సీఎంగా చంద్రబాబును గెలిపించారన్నారు. అధికారం చేపట్టిన ఆరు నెలల్లోనే కూటమి ప్రభుత్వం అభివృద్ధిలో దూసుకుపోతుందన్నారు. అనంతరం గ్రామంలోని పీటీజీ పాఠశాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో బొల్లా వెంకటేశ్వర్లు చౌదరి, వజ్రం నాయక్, డాక్టర్ బసివిరెడ్డి, సత్తిబాబు, ఊరే మార్కు, శ్రీరామ్మూర్తి, పాండునాయక్, స్వామినాయక్, రామ్‌చంద్, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి ప్రగతిలో ముందుండేలా తీర్చిదిద్దాలి

● డీఈవో చంద్రకళ



విద్యార్థుల ప్రగతిని పరిశీలిస్తున్న డీఈవో చంద్రకళ

పిడుగురాళ్ల, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ప్రతి విద్యార్థి ప్రగతిలో ముందుండేలా ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలని పల్నాడు జిల్లా డీఈవో చంద్రకళ తెలిపారు. బుధవారం పిడుగురాళ్ల జడ్పీ పాఠశాల, చంద్రపాలెం ఎంపీయూపీ స్కూల్, కస్తూర్బా పాఠశాలను డీఈవో చంద్రకళ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. విద్యార్థులతో పుస్తకాల్లోని పాఠ్యాంశాలను చదివించడంతో పాటు ఉపాధ్యాయులను విద్యాబోధన గురించి అడిగి తెలుసుకోవడం, కస్తూర్బా పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం, విద్యార్థినుల వసతి గురించి అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు రాబోయే పదో తరగతి పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళిక ఉండాలని సూచించారు. ఆమె వెంట ఎంఈవో -2 శ్రీనివాసరావు, హెచ్ఎంలు తదితరులున్నారు.

డీబీటీతోనే ఎరువుల విక్రయాలు జరపాలి

● వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయ ఏడీఏ శశిధర్‌రెడ్డి

గురజాలటౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): డీబీటీ ద్వారానే ఎరువులు విక్రయాలు జరపాలని వ్యవసాయశాఖ కమిషనర్ కార్యాలయ ఏడీఏ శశిధర్‌రెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని చర్లగుడిపాడు, గంగవరం గ్రామాల్లో ఎరువులు, పురుగు మందుల దుకాణాలను ఆయన పరిశీలించి వ్యాపారులకు పలు సూచనలు చేశారు. స్టాక్ వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. డీబీటీ చేయకపోతే కేంద్ర ప్రభుత్వం రైతులకు అవసరమైనంత మేర ఎరువులు అందించకుండా నిరాకరిస్తుందన్నారు. నిబంధనలు పాటించని దుకాణాలపై చర్యలు తీసుకుంటామన్నారు.

పేటసన్నిగండ్ల ఇన్‌చార్జి సర్పంచ్‌గా రాజేశ్వరి

కారంపూడి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పేటసన్నిగండ్ల ఇన్‌చార్జి సర్పంచ్‌గా తోడేటి రాజేశ్వరి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సర్పంచ్‌గా విధులు నిర్వహిస్తున్న ఉన్నం సావిత్రిప్రియ సెలవుపై వెళ్లారు. ఉపసర్పంచ్‌గా ఉన్న జవ్వాజి నాగేంద్రం తన పదవికి ఇటీవల రాజీనామా చేశారు. దీంతో వార్డు మెంబరుగా ఉన్న తోడేటి రాజేశ్వరిని ఇన్‌చార్జి సర్పంచ్‌గా నియమించారు. ఈ సందర్భంగా ఆమెను కూటమి నేతలు, వార్డు మెంబర్లు సన్మానించారు.


అరటి సాగు చేస్తున్న దృశ్యం

ప్రకృతి వ్యవసాయ నిపుణుడు సుభాష్ పాలేకర్ మాటలే ఆయనకు స్ఫూర్తి. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పంటలు పండించి, ప్రజలు అనారోగ్యం పాలు కాకూడదన్న సంకల్పంతో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పలు పంటలు పండిస్తున్న ఆదర్శరైతు పొందూరి నరసింహారావు. మాచవరం మండలం కొత్తగణేశునిపాడులో ఉన్న పది ఎకరాలలో ఏడేళ్లుగా పలు రకాల పంటలను ఆయన సాగు చేస్తున్నారు.


పొలంలో ఏర్పాటు చేసుకున్న నీటికుంట

ప్రకృతి వ్యవసాయం.. ఆరోగ్య భాగ్యం

- ఏడేళ్లుగా పంటల సాగు చేస్తున్న ఆదర్శరైతు పొందూరి నరసింహారావు
- పది ఎకరాల్లో పలు పంటల సాగు
- క్రిమిసంహారక మందుల ప్రసక్తే లేదు

పిడుగురాళ్ల, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): పంటలు క్రిమికీటకాలబారిన పడకుండా ఉండేందుకు, దిగుబడులు వచ్చేందుకు క్రిమిసంహారక మందులు, రసాయనిక ఎరువుల వినియోగం తప్పనిసరైంది. వాటి వినియోగం ఓ మోతాదుకు మించితే అటు పర్యావరణానికి, ఇటు వినియోగదారుడికి దుష్పరిణామాలు తప్పవు. మనుషుల ఆరోగ్యంపై ఎంతగానో ప్రభావం చూపుతాయి. చిన్నవయసులోనే అనారోగ్యం బారినపడక తప్పనిపరిస్థితులు చూస్తున్నాయి. ఈ విషయాలన్నింటిని గమనించిన ఓ రైతు, తనతోపాటు కొందరి ఆరోగ్యమైనా బాగుండాలని ఆకాంక్షించి.. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పంటలు పండిస్తున్నారు. ఆ ఆదర్శరైతు పేరు పొందూరి నరసింహారావు. పల్నాడు జిల్లా మాచవరం మండలం కొత్తగణేశునిపాడు మాజీ సర్పంచ్ కూడా. ఈ పద్ధతిలో ఏడేళ్లుగా అనేక రకాల పంటలు సాగు చేస్తున్నారు. కొత్తగణేశునిపాడు సమీపంలోనే పది ఎకరాల్లోని తన వ్యవసాయ క్షేత్రంలో సీజనల్‌గా పలు పంటలు పండిస్తున్నారు. సాగుచేసే ప్రతి పంటకు పశువుల ఎరువునే వాడుతుంటారు.

పాలేకర్ మాటలే స్ఫూర్తి

ప్రకృతి వ్యవసాయ నిపుణుడు సుభాష్ పాలేకర్ మాటలు నరసింహారావును ప్రభావితం చేశాయి. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పంటలు పండించడం వల్ల భూసారం దెబ్బతినే అవకాశం లేదని, ఎన్నేళ్లయినా భూమిలో సారం తగ్గిపోదని, ఈ ఆహార ఉత్పత్తులు ఆరోగ్యానికి మంచిదన్న పాలేకర్ మాటలు నరసింహారావుకు గుర్తుండిపోయాయి. ఐదేళ్ల క్రితం తిరుపతిలో ప్రకృతి వ్యవసాయ సాగుపై నాలుగు రోజుల శిక్షణకు కూడా ఆయన హాజరయ్యారు. కొందరు ఐటీ ఉద్యోగులు తమ ఉద్యోగాలను వదిలేసి, ప్రకృతి సాగుపై వారు చూపిన ఆసక్తి కూడా ఆయనపై ప్రభావం చూపింది. అప్పటి నుండి నరసింహారావు ప్రకృతి సాగుకు సన్నద్ధమయ్యాడు.

పండించే పంటలు..


వరి, అరటి, జామ, సపోట, నల్లనేరేడు, డ్రాగన్ ఫ్రూట్, కొబ్బరి, మామిడి, ఉసిరి, దానిమ్మ, మునగ, సీతాఫలం పంటలకు ఎటువంటి మందులు వాడకుండా సాగుచేస్తున్నారు. అంతేకాకుండా, ఈ వ్యవసాయక్షేత్రంలో మేకలు, కోళ్ల, చేపల పెంపకం కూడా ఉంది. 50 మేకలు, 100 కోళ్లను పెంచుతున్నారు. పశువులకు వాడే మేత కూడా ఎటు వంటి రసాయనాలు వాడకుండా పెరిగే జొన్నను మాత్రమే వినియోగిస్తుంటారు.

పొలంలోనే నీటి కుంటలు

సాగునీటికి ఇబ్బంది లేకుండా పొలంలోనే రెండు నీటికుంటలు ఏర్పాటుచేశారు. ఏడాది పొడవునా అన్ని పంటలకు సాగు నీరు అందించేందుకు ఈ నీటికుంటలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. విద్యుత్ సరఫరా లేని సమయంలో సాగునీటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు తగు ఏర్పాట్లు చేశారు. ఈ వ్యవసాయ క్షేత్రంలోని కొబ్బరికాయల్లో కేవలం కొబ్బరినీళ్లు మాత్రమే ఉంటాయి తప్ప కొబ్బరి ఉండేందుకు అవకాశం లేదు.


పశువుల మేత


సొరకాయ సాగు


సాగుచేసిన కొబ్బరి బోండాలు


మేకల పెంపకం


విరగకాసిన ఉసిరి కాయలు

ప్రకృతి సాగుతో సంతోషం



పొందూరి నరసింహారావు, ఆదర్శరైతు

ప్రస్తుతం అన్నిరకాల పంటలపై విపరీతమైన ఎరువులు, పురుగుమందులు వాడకం వల్ల ఎందరో ఆరోగ్యంపై ప్రభావం చూపుతోంది. కొన్నేళ్ల కిందట ఓ నిర్ణయానికి వచ్చాను. ఎటువంటి రసాయనిక పురుగుమందుల వాడకాలు లేకుండా ప్రకృతి సాగుచేయాలని పించింది. అప్పటి నుంచి తన సొంత పొలంలోనే అన్నిరకాల పంటలను సాగుచేస్తున్నాను.. సంతోషంగా వుంది. ప్రకృతి వ్యవసాయాన్ని గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. ఎటువంటి రాయితీలు కల్పించలేదు.

ఏడాది పొడవునా పచ్చడి నిల్వవుండేలా ఉసిరికాయ చెట్లు కూడా కొన్ని వున్నాయి. అలాగే అరటి, జామ చెట్లు కూడా నరసింహారావు సాగు చేస్తున్నాడు.

అంతర పంటలు

అరటి చెట్లలో అంతరపంటగా కంది సాగులో ఉంది. మరికొంత భాగం సొరకాయలు కూడా సాగుచేస్తున్నారు. వీటన్నింటికి కూడా ఎటువంటి రసాయనిక మందులు వాడటం లేదు.

ఖర్చు.. ఆదాయం సరిపోతుంది

పది ఎకరాలలో సాగుచేస్తున్న అనేక రకాల పంటలకు పశువుల ఎరువునే ఎక్కువగా ఉపయోగించడం వల్ల ఖర్చు తక్కువ అవుతున్నప్పటికీ దిగుబడి కూడా తక్కువగానే వస్తోంది. దీంతో పండించిన ఉత్పత్తులు రవాణా ఖర్చులు కలుపుకుంటే ఖర్చు.. ఆదాయం సరిపోతుంటుంది. ఈ వ్యవసాయ పనులన్నింటిని రెండు కుటుంబాల వారు చేస్తూ జీవనోపాధి పొందుతున్నారు.

దూరప్రాంతాలకు విక్రయాలు

అరటి, జామ, సపోట, కొబ్బరి, సీతాఫలాలను హైదరాబాద్, గుంటూరు, పిడుగురాళ్ల, కందుకూరు తదితర ప్రాంతాల వారు ఇక్కడికే వచ్చి కొనుగోలు చేస్తుంటారు. కోళ్ల, చేపలను ప్రతి ఆదివారం కొన్ని ప్రాంతాల వారు నేరుగా వచ్చి కొనుగోలు చేస్తుంటారు. మేకలను కూడా రెండు మూడు నెలలకు ఒకసారి దూరప్రాంతాల నుంచి వచ్చినవారు కొనుగోలు చేసుకొని వెళ్తుంటారు. చింతలూరు సన్నాల బియ్యంపై ఎక్కువ మంది రైతులు ఆసక్తి చూపుతున్నారు. కేరళలో సాగులో ఉన్న రెడ్ రైస్‌తో షుగర్ అదుపులో ఉండటం వల్ల ఎక్కువ మంది మధుమేహ వ్యాధిగ్రస్తులు ఈ రెడ్ రైస్‌ను కొనుగోలు చేస్తున్నారు. మొదటిసారి విత్తనాలను కొనుగోలు చేసుకొని వాటినే మరికొన్నేళ్ళపాటు విత్తనాల తయారీకి, సాగుకు నరసింహారావు ఉపయోగిస్తుంటారు.


పక్వానికి రాకముందే పండిన అరటి గెలలు


కొల్లిపర మార్కెట్‌లో వేలంలో గెలలను పాడుకుంటున్న వ్యాపారస్తులు

- వ్యాపారులు రాక.. నిలిచిపోతున్న వేలం పాటలు
- దిక్కుతోచని స్థితిలో రైతులు

అరటి గెలలు.. పడిపోయిన ధరలు

కొల్లిపర, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఈ సీజన్‌లో అయినా ధర వస్తుందన్న ఆశతో ఎదురుచూస్తున్న అరటి రైతులకు నిరాశే మిగిలింది. మండల కేంద్రం కొల్లిపర అరటి కాయల మార్కెట్‌లో అరటి గెలల ధరలు ఒక్కసారిగా పడిపోయాయి. మండలంలోని వల్లభాపురం, మున్నంగి, కొల్లిపర, దావులూరిపాలెం, హనుమాన్‌పాలెం, అన్నవరంలంక, బొమ్మువానిపాలెం, తూములూరు గ్రామాల్లోని రైతులు, అరటి గెలలకు ఆశించిన ధర వస్తుందనే ఆశతో ఈ సంవత్సరం అధిక విస్తీర్ణంలో సాగు చేశారు. లక్షలాది రూపాయలను పెట్టుబడి పెట్టారు. రైతులకు తీరా పంట చేతికొచ్చే సమయానికి అరటి గెలలకు ఒక్కసారిగా ధరపడిపోయింది. వాతావరణంలో వస్తున్న మార్పులు, చలి, మంచు కురుస్తుండటంతో పక్వానికి రాకముందే అరటి గెలలు తోటల్లోనే పండిపోతున్నాయని రైతులు చెబుతున్నారు. చేసేదిలేక గెలలను నరికి మార్కెట్‌కు తరలిస్తున్నారు. పండిన గెలలను కొనేనాథుడే లేకపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. పదిహేను రోజుల క్రితం మొదటి రకం అరటి గెల ధర రూ.200 నుంచి రూ.250 వరకు, రెండవ రకం అరటి గెల ధర రూ.150నుంచి రూ.100 వరకు ధర పలికింది. అటువంటిది, మొదటి రకం అరటి గెల ధర రూ.70నుంచి రూ.90, రెండో రకం ధర రూ.35 నుంచి రూ.40 వరకు ధర పలుకుతోంది. చక్కెరకేళి గెల ధర గతంలో రూ.100 ఉండేది. ప్రస్తుతం రూ.40 మించి ఉండక పోతుండటంతో రైతులు కన్నీరుమున్నీరు అవుతున్నారు. వ్యాపారులు రాకపోవడంతో వేలం పాటలు నిలిచిపోతున్నాయని, దీంతో మార్కెట్‌లోని గెలలు పండిపోతున్నాయని రైతులు చెబుతున్నారు. పండిన గెలలను అయినకాడికి అమ్ముకునే పరిస్థితి ఏర్పడిందని, పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు.

మురుగు శుద్ధికి.. ఏదీ చిత్తశుద్ధి

(5వ పేజీ తరువాయి)

చూపారు కానీ, ప్రజావసరాలకు మాత్రం అడుగు ముందుకు వేయలేదు. దీనికితోడు గత ప్రభుత్వంలో ఏ పనులకు సంబంధించి టెండర్లు పిలిచినా, డబ్బు చెల్లించరన్న కారణంతో కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. దీంతో ఎక్కడివక్కడే మూలన పడ్డాయి. అప్పటికే నిర్మాణంలో ఉన్నవాటి పనులయితే నత్తనడక కంటే దారుణంగా సాగాయి. మొత్తం మీద 80 ఎకరాల వరకు స్థలాలను సేకరిస్తే ప్రాజెక్టులు మొదలైపోయేవి. కానీ ఒక్క ఎకరా కూడా కొన్న దాఖలాలు లేవు. దీంతో గత ప్రభుత్వం గద్దెనెక్కేనాటికి పనులు ఏ దశలో ఉన్నాయో, ఇప్పుడు కూడా అదే దశలో ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం నిధులు వెచ్చించే పరిస్థితి లేకపోయినా, కేంద్రం నిధులిచ్చినా వాటినీ సద్వినియోగం చేసుకోలేకపోవటం దయనీయమే.

తెనాలి, నరసరావుపేట మున్సిపాలిటీల్లో మినహా పెద్దగా అడుగు ముందుకు పడిన పరిస్థితిలేదు. నరసరావుపేటలో కూడా 8 ఏళ్ల క్రితమే నిర్మాణం పూర్తయి, వినియోగంలో ఉంది. తెనాలిలో మాత్రం 10 ఎంఎల్‌డీల సామర్థ్యమున్న ప్లాంట్ పనులు చివరి దశలో ఉన్నాయి. రూ. 28 కోట్లతో ఈ పనులు జరుగుతున్నాయి. వీటిలో ప్లాంట్ నిర్మాణం, యంత్రాల కోసం రూ. 21కోట్లు కేటాయిస్తే, మరో రూ. 7కోట్లు పదేళ్ల నిర్వహణ ఖర్చు కింద కేటాయించారు. ఇదికాక మరో 9.5 కోట్లతో 2 ఎంఎల్‌డీల సామర్థ్యం గల ప్లాంట్ నిర్మాణం చేపట్టారు కానీ, అది పునాదుల దశలోనే ఉంది. రూ. 80 లక్షలతో పునాదులు పూర్తిచేసి, పైన గోడల నిర్మాణం కోసం ఇనుప చువ్వలను ఏర్పాటు చేశారు. అయితే పనులు అక్కడితో ఆగిపోవటంతో అవి తుప్పుపట్టి పనికిరాకుండా పోతున్నాయి. గత వైసీపీ సర్కారు కాలంలో దీనిపై కాస్తంతైనా దృష్టిపెట్టి ఉంటే ఇప్పటికి నిర్మాణం పూర్తయి, వినియోగంలోకి వచ్చేది. ఇదే తరహాలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో అన్ని ప్రాజెక్టులు ఎక్కడివక్కడే ఆగిపోయి ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక కొన్ని ప్రాజెక్టుల్లో కదలిక వచ్చింది.

ప్రభుత్వ స్థలాలు అందుబాటులో ఉన్నా...

గుంటూరు కార్పొరేషన్, మరికొన్ని మున్సిపాలిటీల్లో ప్లాంట్ల నిర్మాణానికి అవసరమైన స్థలాలు అందుబాటులో ఉన్నా పనులు మొదలే కాలేదు. గుంటూరు కార్పొరేషన్ పరిధిలో 123 ఎంఎల్‌డీ మురుగునీటి శుద్ధికోసం ఐదుచోట్ల ప్లాంట్‌లను నిర్మించాలని నిర్ణయించారు. గోరంట్లలో రెండు చోట్ల 2.54, 2.39 ఎకరాల్లో రెండుప్లాంట్ల నిర్మాణ పనులు 90శాతం పూర్తయితే, సాంకేతిక పనులు మాత్రం కేవలం 50శాతమే జరిగాయి. రెండోదానిలో అయితే 25శాతం కూడా పూర్తికాలేదు. శుద్ధపల్లి డొంకలో నిర్మాణపనులు అసలు మొదలేకాలేదు. ఆర్. అగ్ర హారంలో 4 ఎకరాల్లో, రైల్వే ట్రాక్ సమీపంలో మరో 6.88 ఎకరాల్లో నిర్మించాల్సిన పెద్దప్లాంట్‌ల పనులు మాత్రం నత్తనడకన సాగుతున్నాయి. వీటి మొత్తానికి ప్రభుత్వస్థలమే ఉన్నా పనులు మాత్రం మందకొడిగా సాగిపోతున్నాయి. అటు పల్నాడు జిల్లాలోనూ మాచర్ల, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, దాచేపల్లి, గురజాల, వినుకొండ మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో ఇంకా స్థలాలు సేకరించాల్సిన దశలోనే ఉన్నారు. నరసరావుపేటలో 15.55 ఎంఎల్‌డీల ప్లాంట్ పూర్తయిపోతే, మరో 3ఎంఎల్‌డీల ప్లాంట్ మాత్రం ఊసేలేదు. చిలకలూరిపేటలోనూ భారీ ప్లాంట్ అవసానదశలోనే ఉంది. అటు బాపట్ల జిల్లాలోనూ అద్దంకి, బాపట్ల, చీరాల, రేపల్లె మున్సిపాలిటీల్లోనూ చాలావరకు స్థలాలను సేకరించే పనిలో నే ఉన్నారు. ఇటు గుంటూరు జిల్లాలోని పొన్నూరు, మంగళగిరి, తాడేపల్లి వంటి మున్సిపాలిటీల్లోకూడా ఎక్కడి పనులు అక్కడే అన్నట్టున్నాయి. మొదలయి న పనులైతే నాలుగేళ్ల క్రితం ఆగిపోయి తుప్పుపట్టిపోతున్నాయి. దీంతో మురుగు శుద్ధి లక్ష్యం నెరవేరక, పట్టణాలు దుర్గంధంతోనే నిండిపోతున్నాయి.

పట్టుదల, కృషి, ప్రణాళికతో లక్ష్యసాధన

- నగర కమిషనర్ పులి శ్రీనివాసులు
- మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ప్రారంభమైన స్పోర్ట్స్‌మీట్

గుంటూరు (విద్య), డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): నిర్దిష్ట ప్రణాళిక, కృషి, పట్టుదల ఉంటే లక్ష్యాన్ని సాధించవచ్చని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. బుధవారం స్థానిక గుజ్జనగుండ్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో 27వ బాలికల ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ మీట్‌లో ఆయన ప్రసంగించారు. తొలుత క్రీడాకారుల మార్చ్ ఫాస్ట్ స్వీకరించి, జాతీయ, క్రీడా పతాకాలను ఆవిష్కరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.ఉషారాణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కమిషనర్ శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యార్థులకు తమ భవిష్యత్ లక్ష్య నిర్ధారణ అనేది కీలకమని, లక్ష్య సాధనలో అధ్యాపకుల బోధనలతోపాటు సమగ్ర కృషి కూడా ప్రధానమని సూచించారు. లక్ష్యసాధనకు పట్టుదల, కృషి, ప్లానింగ్ తప్ప ఏవిధమైన షార్ట్‌కట్‌లు ఉండవన్నారు. ప్రస్తుతం పాలిటెక్నిక్ కోర్సులకు ఉజ్వల భవిష్యత్ ఉందన్నారు. గౌరవ అతిథి మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ టి.రాఘవరావు మాట్లాడుతూ క్రీడలు ప్రతి ఒక్కరికీ అవసరమని, ప్రస్తుతం కార్పొరేట్ విద్యా విధానంలో విద్యార్థులు క్రీడలకు దూరమవుతున్నారన్నారు. ఇంకా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఉషారాణి ప్రసంగించారు. కమిషనర్ పులి శ్రీనివాసులు, మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ కళాశాల అభివృద్ధికి రూ. 20వేల చొప్పున విరాళం అందచేశారు. కార్యక్రమంలో ఎంబీటీఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ టి. శేఖర్, ప్రభుత్వ టెక్స్‌టైల్ కళాశాల పిన్సిపాల్ శైలజ పాల్గొన్నారు. ఈ స్పోర్ట్స్‌మీట్‌లో జిల్లా వ్యాప్తంగా వివిధ క్రీడల్లో 18 పాలిటెక్నిక్ కళాశాలల నుంచి 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నగర కమిషనర్ శ్రీనివాసులు

స్టాంప్ కష్టాలకు చెక్

- విక్రయాల్లో అక్రమాలను అరికట్టేందుకు ఈ-స్టాంపింగ్
- ఆధార్ తప్పనిసరి చేస్తూ కూటమి ప్రభుత్వం నూతన విధానం

సత్తెనపల్లి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఆస్తుల క్రయ, విక్రయాలకు అవసరమైన స్టాంప్‌లు దొరక్క ప్రజలు తిప్పలు పడాల్సి వచ్చేది. సరఫరా అయిన స్టాంపుల్లో కొందరు పెద్దమొత్తంలో కొనుగోలు చేసి కృత్రిమ కొరత సృష్టించేవారు. అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. వీటికి చెక్ పెట్టేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దస్తావేజుల రిజిస్ట్రేషన్‌కు వాడే నాన్ జుడిషియల్ స్టాంప్ అమ్మకాలను ప్రక్షాళన చేస్తూ నూతన విధానానికి శ్రీకారం చుట్టింది. స్టాంపుల విక్రయాల్లో అక్రమాలను అరికట్టడానికి కొత్త నిబంధనలు తెచ్చింది. గత వైసీపీ ప్రభుత్వం ఈ - స్టాంపింగ్‌ను ప్రవేశ పెట్టి ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకతను మూట గట్టుకుంది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం నాన్ జుడిషయల్ స్టాంపుల వైపు మొగ్గు చూపింది. అందుకు అనుగుణంగా నాసిక్ నుంచి పెద్ద మొత్తంలో స్టాంపులను తెప్పించి సరఫరా చేసింది. నాన్ జుడిషియల్ స్టాంపులు కావాలంటే గతంలో ఒక ఫారంలో పేరు, డినామినేషన్, చిరునామా తదితర వివరాలను నమోదు చేసి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇవ్వాల్సి ఉండేది. ఆ తరువాత స్టాంపులు ఇచ్చేవారు. ప్రత్యేక స్టాంప్ వెండర్ల ద్వారా కూడా వీటిని అమ్ముతుంటారు. దీనివలన కొందరు వెండర్లు ఎక్కువ మొత్తంలో స్టాంప్‌లు కొనుగోలు చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నారనే విమర్శలున్నాయి. స్టాంపు కాగితాలపై పాత తేదీలను వేసి ఇవ్వడంతో న్యాయపరమైన చిక్కులు ఎక్కువయ్యేవి. నకిలీ స్టాంపులు కూడా వెలుగులోకి వచ్చాయి. ఈ అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించి నూతన విధానాన్ని ప్రవేశ పెట్టింది. స్టాంపులు కొనుగోలుకు ఆన్‌లైన్ విధానం తెచ్చింది. ఆధార్ సంబంధిత వెండర్ కంప్యూటర్‌లో నమోదు చేయాలి. ఆ తరువాత కొనుగోలుదారుడి మొబైల్ నెంబర్‌కు ఓటీపీ వస్తుంది. దానిని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ కౌంటర్‌లో చూపిస్తే స్టాంప్‌లు ఇస్తారు. ఒక వ్యక్తి ఐదు నుంచి పది స్టాంపులు వరకు కొనుగోలు చేసుకోవచ్చు. ఆధార్ నెంబరు నమోదు వల్ల ఎవరు ఎన్ని స్టాంపులు కొనుగోలు చేశారో తెలుస్తుంది. ప్రైవేటు స్టాంప్ వెండర్లు కూడా ఇప్పుడు తప్పనిసరిగా కంప్యూటర్, ప్రింటర్ కొనుగోలు చేయాల్సిందే. నూతన విధానంలో వెండర్ల వద్ద సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ కౌంటర్లలో ఏఏ స్టాంపులు ఎన్ని ఉన్నాయనే సమాచారాన్ని అధికారులు తెలుసుకునే అవకాశం ఉంది. ఈ క్రమంలో విక్రయాలు తక్కువగా సాగే కార్యాలయాల నుంచి అవసరమైన వారికి తెప్పించుకునే వెసులు బాటు ఉంటుంది. తద్వారా స్టాంపుల కృత్రిమ కొరతకు చెక్ పడుతుంది. స్టాంప్ తీసుకోవాలంటే ఆధార్ తప్పనిసరి చేయటంతో పెద్ద మొత్తంలో కొనుగోలు చేసే అవకాశం లేకుండా పోతుంది.


సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

అందుబాటులో స్టాంపులు

నాన్ జుడిషయల్ స్టాంపులు సబ్ రిజిస్టర్ కార్యాలయాల్లో అందుబాటులో ఉన్నాయి. కంప్యూటర్‌లో ఆధార్ నెంబరు నమోదు చేసుకుని స్టాంపులు విక్రయించాలి. నగదు ఆన్‌లైన్‌లో చెల్లించే అవకాశం ఉంది. స్టాంప్ వెండర్లు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి.

అశోక్, సత్తెనపల్లి సబ్ రిజిస్ట్రార్

పరీక్షా కాలమ్



భాషపై పట్టు.. అవగాహన అవసరం

- హిందీలో అత్యుత్తమ మార్కుల సాధనకు మార్గం

గుంటూరు(విద్య), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): హిందీ భాష కఠినమైనది. మార్కుల సాధించడం కష్టం కాకూడదని సిలబస్‌లోని నాలుగు పాఠాలను తొలగించారు. విద్యార్థులకు హిందీ పరీక్షను సులభ, సరళతరం చేశారు. అయితే భాషపై పట్టు, స్పష్టమైన అవగాహన ఉంటే విద్యార్థులు హిందీలో అత్యధిక మార్కులు తెచ్చుకునే అవకాశం ఉందని గుంటూరులోని బొర్రా నాగేశ్వరరావు (ఎస్‌బీఎన్‌ఆర్) మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, హిందీ పండిట్ జిలానీబాషా ఆంధ్రజ్యోతికి తెలిపారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..


జిలానిబాషా, హెచ్ఎం ఎస్‌బీఎన్‌ఆర్‌ఎంసీ ఉన్నత పాఠశాల, గుంటూరు

- మొదటి పేజీలో ఎంత చక్కటి దస్తూరితో రాశారో చివరి పేజీ కూడా అంతే చక్కటి దస్తూరితో జవాబులు తప్పులు, కొట్టివేతలు లేకుండా రాస్తే మంచి మార్కులు సాధించవచ్చు.
- సెక్షన్ నంబర్లు, ప్రశ్నలు నంబర్లు వేస్తూ జవాబులు రాస్తే నూటికి నూరు మార్కులు సాధించే అవకాశం ఉంది.
- జవాబులు పాయింట్లు వారీగా సంక్షిప్త వాక్యాలలో అక్షర దోషాలు లేకుండా రాస్తే పూర్తి మార్కులు పొందవచ్చు.
- ప్రశ్నపత్రంలో అవగాహన ప్రతిస్పందన, వ్యక్తీకరణ సృజనాత్మకత భాషాంశాలపై ప్రశ్నలు ఉంటాయి.
- తత్సమ, చితద్భవ పదాలు క్రియను గుర్తించడం, విస్తరించిన సంఖ్యను అంకెలలో గుర్తించడం, పర్యాయపదాలు, సంధి సమాసం, ఉపసర్గ, ప్రత్యయ్, విభక్తులు వంటి ప్రశ్నలు 12 మార్కులకు వస్తాయి.
- పాఠ్యాంశాల నుంచి ప్రశ్నలు నేరుగా అడిగే అవకాశం ఉన్నందున విద్యార్థులు సాధన చేసి చదువుకుంటే 12 మార్కులు సులువుగా పొందవచ్చు
- అవగాహన ప్రతి స్పందన విభాగంలో పరిచిత గద్యం, పరిచిత పద్యం ఇచ్చి దాని కింద ఐదు ప్రశ్నలు అడిగి ఒక వాక్యంలో జవాబు రాయమని అడుగుతారు.
- అపరిచిత పద్యం, గద్యం ఇచ్చి ఐదు బహుళైచ్ఛిక ప్రశ్నలకు జవాబులు గుర్తించాలి. ఇచ్చిన పేరాగ్రాఫ్‌ను క్షుణ్ణంగా చదివి అవగాహన చేసుకుని జవాబులు రాస్తే ఈ విభాగంలో 20 మార్కులు సులువుగా పొందవచ్చు.
- కవి కాలాదులు పరిచయం రాయడానికి ప్రాచీన కవులు, ఆధునిక కవులపై రెండు ప్రశ్నలు ఇచ్చి ఒక దానికి జవాబు రాయమంటారు. కబీర్‌దాసు గురించి పరిచయం చదువుకుంటే ఐదు మార్కులు పొందే అవకాశం ఎక్కువగా ఉంటుంది.
- గద్యభాగ రచయితల గురించి పేరాగ్రాఫ్‌ను ఇచ్చి ఖాళీలు పూరించమని ఐదు ప్రశ్నలు ఇస్తారు. పేరాగ్రాఫ్‌ను క్షుణ్ణంగా చదివితే పూర్తి మార్కులు పొందే అవకాశం ఉంది.
- లఘు ప్రశ్నల విభాగంలో పద్య భాగం నుంచి మూడు ప్రశ్నలు, గద్యభాగం నుంచి మూడు ప్రశ్నలు, ఉపవాచకం నుంచి రెండు ప్రశ్నలు మొత్తంగా ఎనిమిది ప్రశ్నలు అడిగి ఏవైనా ఆరింటికి జవాబు రాయమంటారు. సాఖీ పాఠం నుంచి మొదటి నాలుగు దోహాలలో ఒక దోహా నేరుగా ప్రశ్నగా వస్తుంది. వీటికి మూడు నాలుగు సంక్షిప్త వాక్యాలలో జవాబు రాస్తే సరిపోతుంది.
- వ్యాస రూప ప్రశ్నల్లో పద్య భాగం నుంచి రెండు ప్రశ్నలు ఇచ్చి ఒకదానికి, గద్య భాగంలో రెండు ప్రశ్నలు ఇచ్చి ఒకదానికి జవాబు రాయమంటారు. మీరాబాయి పద్ పాఠం నుంచి, బడే భాయి సాహబ్ పాఠం నుంచి వ్యాస రూప ప్రశ్నలు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంది.
- లేఖలో 8 మార్కులకు ఛుట్టి పత్ర్, పితా కో పత్ర్, మిత్ర్ కో పత్ర్ వంటివి సాధన చేసి చదివితే కచ్చితంగా ఒక లేఖ వచ్చే అవకాశం ఉంది.
- చివరిగా 10 మార్కులకు నాలుగు వ్యాసాలు ఇచ్చి ఒకదానిని జవాబు రాయమని అడుగుతారు దీనిలో ప్రియ త్యోహార్, దూరదర్శన్ వంటివి సాధన చేసి చేసి చదివితే ప్రశ్నలు వచ్చే అవకాశం ఉంది.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

ఏపీవోగా పుష్పరాజ్ బాధ్యతల స్వీకారం

ఈపూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఈపూరు మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ఏపీవోగా పుష్పరాజ్ బుధవారం బాధ్యతలు చేపట్టారు ఇప్పటివరకు ఇక్కడ ఏపీవోగా పనిచేసిన లక్ష్మణరావు బొల్లాపల్లి మండలం బదిలీ అయ్యారు. పని కావాలని అడిగిన జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం కింద పని కల్పిస్తామని ఏపీవో తెలిపారు.

కోట్లు ఖర్చు చేసినా తప్పని విద్యుత్ కష్టాలు

- నిరుపయోగంగా విద్యుత్ సబ్‌స్టేషన్
- పనులు పూర్తి కాకుండానే ప్రారంభం
- ఎన్నికల కోడ్ ప్రకటనతో వైసీపీ ప్రభుత్వ నిర్వాకం
- ప్రారంభించి 9నెలలైనా వినియోగించుకోలేని దుస్థితి



వేల్పూరులో నిరుపయోగంగా ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్

వేల్పూరు (శావల్యాపురం) డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కోట్ల కొద్దీ ప్రజాధనాన్ని ఖర్చుచేసి ఏర్పాటు చేసిన విద్యుత్ సబ్‌స్టేషన్ నేడు నిరుపయోగంగా మారింది. తన సొంత గ్రామమైన వేల్పూరు ప్రజలకు కరెంట్ కష్టాలు లేకుండా చేస్తానని, 24గంటలు ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందిస్తానంటూ గొప్పలు చెప్పిన వినుకొండ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఎన్నికల షెడ్యూల్ రానుండటంతో పనులు పూర్తి కాకుండానే విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభోత్సవం చేసేశారు. దీంతో సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తయి 9నెలలు గడుస్తున్నా ఇప్పటికీ వేల్పూరు ప్రజలు దాన్ని వినియోగించుకోలేని దుస్థితి. గుంటూరు- కర్నూలు జాతీయ రహదారి నుంచి వేల్పూరుకు వెళ్ళే రోడ్డు వెంబడి రూ.4.50కోట్లు ఖర్చుతో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణాన్ని చేశారు. అంతలో కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్రంలో శాసనసభ ఎన్నికలకు షెడ్యూల్ విడుదల చేయనున్న సమయంలో ఎన్నికల కోడ్ వస్తుందనే భయంతో సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తి కాకుండానే హడావిడిగా ప్రారంభోత్సవం చేశారు. ప్రారంభోత్సవానికి విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు అడ్డు చెప్పకుండా వత్తాసు పలకడంతో సబ్‌స్టేషన్ ప్రారంభించారు. శావల్యాపురం సబ్‌స్టేషన్ నుంచి వేల్పూరు సబ్‌స్టేషన్‌కు గుంటూరు-కర్నూలు జాతీయ రహదారి పక్కగా కరెంట్ స్తంబాలు వేసి విద్యుత్ లైన్‌ను ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ ఇంతవరకు కరెంట్ స్తంభాల ఏర్పాటు ప్రారంభించనే లేదు. వేల్పూరు సబ్‌స్టేషన్ నుంచి గంటవారిపాలెం, వేల్పూరు, వెలమావారిపాలెం, ఇర్లపాడు, బొగ్గరం గ్రామాలకు కరెంట్ స్తంబాలు వేశారేగాని కండక్టర్లు అందుబాటులో లేకపోవడంతో విద్యుత్ లైన్‌లు ఏర్పాటు చేయలేదు. సబ్‌స్టేషన్‌లో విధులు నిర్వహించేందుకు సిబ్బందిని కూడా నియమించి వారికి శిక్షణను ఇస్తున్నారు. సబ్‌స్టేషన్‌లో కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయకుండా ప్రారంభోత్సవం కోసం వేరే సబ్‌స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్‌ను తాత్కాలికంగా తెచ్చి బిగించారని ప్రజలు విమర్శిస్తున్నారు. కోట్లు ఖర్చు చేసి నిర్మించిన సబ్‌స్టేషన్ ఇంకా అందుబాటులోకి రాకపోవడంతో ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. రాజకీయ స్వార్థంతో ప్రజలను మభ్య పెట్టేందుకు పనులు పూర్తి కాకుండానే సబ్‌స్టేషన్‌ను ప్రారంభించారని ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి సబ్‌స్టేషన్ పనులను త్వరితగతిన పూర్తిచేసి వినియోగంలోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

- సందెపూడిలో జరిగిన రెవెన్యూ సదస్సులో కలెక్టర్



సందెపూడి రెవెన్యూ సదస్సులో అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు

యడ్లపాడు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు ఎంతగానో దోహదపడతాయని కలెక్టర్ అరుణ్‌బాబు అన్నారు. బుధవారం యడ్లపాడు మండలం సందెపూడిలో జరిగిన రెవెన్యూ సదస్సును కలెక్టర్ ఆకస్మిక పరిశీలన చేశారు. సదస్సుకు హాజరైన రైతుల నుంచి అర్జీలను స్వీకరించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఈ నెల 6 నుంచి రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నదన్నారు. భూ యజమానులు సమస్యలను సరైన ఆధారాలతో అర్జీల రూపంలో అధికారులకు అందించాలని సూచించారు. తక్షణ పరిష్కారం కోసం ఈ సదస్సులు ఎంతగానో దోహదపడతాయని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను పరిశీలించి వెంటనే ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం రెవెన్యూ సిబ్బంది వచ్చిన దరఖాస్తులు ఆన్‌లైన్ చేస్తున్న విధానాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో నరసరావుపేట ఆర్డీవో మధులత, యడ్లపాడు తహసీల్దార్ విజయశ్రీ, మండల సర్వేయర్ సురేంద్ర, సర్పంచ్ మద్దినేడి రామకృష్ణ, ఆర్‌ఐ జయరాజు తదితరులు పాల్గొన్నారు.

అగ్రహారం భూములకు పాసు పుస్తకాలు ఇప్పించండి

నూజెండ్ల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అగ్రహారం భూములకు పట్టాదారు పాసు పుస్తకాలు ఇప్పించాలని బుధవారం తిమ్మాపురంలో జరిగిన రెవెన్యూ సభలో తహసీల్దార్ జీ రమేష్ కుమార్‌కు రైతులు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రైతుల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించేందుకు ప్రభుత్వం రెవెన్యూ గ్రామ సభలు నిర్వహిస్తోందని, అగ్రహారం భూముల రైతుల సమస్యలు త్వరలోనే పరిష్కారమవుతాయన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ చండీరాణి, వీఆర్వో పోలయ్య, నీటి సంఘం అధ్యక్షులు నర్రా శ్రీను, నర్రా రాజారావు, అమరా వెంకటేశ్వర్లు, పేరం సుధాకరరెడ్డి, కైపు వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పిట్టబండలో 9 అర్జీలు

వినుకొండ టౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రెవెన్యూ సదస్సులకు గ్రామాల్లో రైతుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. డిప్యూటీ కలెక్టర్ శ్రీరాములు ఆధ్వర్యంలో మండలంలోని పిట్టంబండ గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతుల నుంచి 9అర్జీలు రావడంతో సమస్యలను పరిష్కరించేందుకు అవకాశం ఉన్న అర్జీదారి సమస్యలను కొన్ని పరిష్కరించి మరికొన్నింటిని త్వరలో పరిష్కరిస్తామని రైతులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్, ఆర్‌ఐ శ్రీహరి, సిబ్బంది పాల్గొన్నారు.

సహకార సంఘాల్లో రుణాల బకాయిలు తగ్గించాలి

- కలెక్టర్ అరుణ్ బాబు



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ అరుణ్‌బాబు, అధికారులు

నరసరావు పేట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సహకార సంఘాల్లో ఉన్న రుణాల బకాయిలను 80వరకు తగ్గించాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం జిల్లాలోని సహకార సంఘాల మొండి బకాయిలు రూ.50 కోట్లకు మించి ఉన్నాయని, వీటిని మార్చికల్లా తగ్గించి సంఘాలను బలోపేతం చేయాలన్నారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో బుధవారం జరిగిన సహకార సంఘాల అభివృద్ధి కమిటీ సమావేశంలో అయన మాట్లాడారు. సహకార సంఘాల అభివృద్ధి పంచవర్ష ప్రణాళికకు ఆమోదం తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి లక్ష్యాలను నిర్దేశించారు. జిల్లాలో సరైన రహదారి లేని 23 సహకార సంఘాల గోడౌన్లకు డ్వామా సాయంతో రోడ్డు నిర్మించాలని కలెక్టర్ సూచించారు. నాదెండ్ల మండలంలోని జన్ ఔషధి కేంద్రానికి అదనంగా 4 జన్ ఔషధి కేంద్రాలను ప్రారంభించాలన్నారు. మార్చికల్లా సహకార సంఘాల నేతృత్వంలో రెండు నూతన పెట్రోల్ స్టేషన్లు ప్రారంభించాలని వచ్చే ఆర్థిక సంవత్సరంలో మరో 5 ఇంధన, 5 గ్యాస్‌స్టేషన్లు నిర్మించాలన్నారు. కోల్డ్ స్టోరేజీలు, ఎరువుల షాపులు, షాపింగ్ కాంప్లెక్స్‌లు, సూపర్ మార్కెట్ల సంఖ్యను పెంచాలన్నారు. పైలట్ ప్రాజెక్టుగా కారుమంచి, బొగ్గారం, ముప్పాళ్ల, శావల్యాపురం, అమరావతి, అత్తలూరు గ్రామాల్లో పీఎం సూర్యఘర్ పథకం ద్వారా 300 యూనిట్ల లోపు విద్యుత్ వాడే సహకార సంఘాల సభ్యులకు సోలార్ ప్యానెళ్ల ఏర్పాటుకు రుణం, సబ్సిడీ అందించాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే, జిల్లా సహకార అధికారి వెంకట రమణ, నాబార్డు డీడీఎం శరత్, జిల్లా వ్యవసాయ అధికారి మురళి, పశు సంవర్ధక శాఖ అధికారి కాంతారావు, మత్స్య అధికారి సంజీవ రావు, పంచాయతీ రాజ్ ఏవో జయకృష్ణ, సహకార బ్యాంకుల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

నరసింహస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే చదలవాడ



మంగళగిరి ఆలయ ప్రాంగణంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ, ఈవో రామకోటిరెడ్డి

నరసరావుపేట టౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి పానకాల నరసింహ స్వామిని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు బుధవారం దర్శించుకున్నారు. ఆలయ సిబ్బంది ఆయనకు సాదరస్వాగతం పలికారు. పానకాల స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఈవో రామకోటిరెడ్డి, అర్చకులు, తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్‌యూ స్విమ్మింగ్ జట్టుకు ఎస్ఎస్ఎన్ విద్యార్థి ఎంపిక

నరసరావుపేట టౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పురుషుల స్విమ్మింగ్ జట్టుకు ఎస్ఎస్ఎన్ కళాశాల విద్యార్థి ఎస్.జగదీశ్ ఎంపికయ్యాడని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంఎస్ సుధీర్ బుధవారం తెలిపారు. గుంటూరు జిల్లా గోరంట్ల నెక్ట్స్ జెన్ ఇంటర్నేషనల్ స్కూల్ జరిగిన పోటీలలో ఈ ఘనత సాధించాడన్నారు. సౌత్-వెస్ట్ అంతర విశ్వవిద్యాలయాల స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ పోటీలలో భాగంగా ఈ నెల 21 నుంచి 23 వరకు చెన్నై ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయంలో జరిగే పోటీలలో ఏఎన్‌యూ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తాడన్నారు. ఎంపికైన ఎస్.జగదీశ్‌ను కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు కపిలవాయి విజయకుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్, కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ నాగసరపు సుబ్బరాయగుప్తా, ఉపాధ్యక్షుడు పెనుగొండ వెంకటేశ్వరరావు, జాయింట్ సెక్రటరీ వూటుకూరి వెంకటఅప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పీ శ్రీనివాససాయి, పీడీ డాక్టర్ యక్కల మధుసూధనరావు, పాలకవర్గ సభ్యులు అభినందించారు.

వినుకొండలో పారిశుధ్య పనులకు శ్రీకారం

వినుకొండ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని డివైడర్లపై ఏపుగా పెరిగిన కలుపు మొక్కలను తొలగించే కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ సుభాష్‌చంద్రబోస్ బుధవారం శ్రీకారం చుట్టారు. డివైడర్ల వద్ద పేరుకుపోయిన మట్టితోపాటు డివైడర్లను శుభ్రంచేయించారు. డివైడర్లపై ఏర్పాటుచేసిన మొక్కలకు నీరు సరఫరా చేయించారు.

మాజీ చైర్మన్ మాజేటికి ఘన నివాళి

చిలకలూరిపేట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణ ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో బుధవారం చిలకలూరిపేట మాజీ మున్సిపల్ చైర్మన్ మాజేటి వెంకటేశ్వర్లు (బేబి) సంస్మరణ సభ జరిగింది. మాజేటి చిత్రపటానికి పలువురు ప్రముఖులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, మాజీ మంత్రి విడదల రజిని, మాజేటి కుమారుడు ఎమ్ఎల్ఎస్ మూర్తి, పటేల్, పేలూరి రామారావు, గుర్రం సాంబశివరావు, మురికిపూడి ప్రసాద్ పాల్గొన్నారు.

అంతర కళాశాలల అథ్లెటిక్స్ పోటీలలో వాగ్దేవి విద్యార్థుల ప్రతిభ

నరసరావుపేట టౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అంతర కళాశాల అథ్లెటిక్స్ పోటీలలో వాగ్దేవి డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారని ప్రిన్సిపాల్ కపిలవాయి రాజేంద్రప్రసాద్ బుధవారం తెలిపారు. డీ వీరాంజనేయులు డిస్కస్ త్రోలో గోల్డ్, షార్ట్‌పుట్‌లో సిల్వర్ మెడల్ సాధించాడన్నారు. ఎస్కే అల్మాస్, కే ప్రవీణ్‌కుమార్, జె జస్వంత్‌కుమార్, టీ నాగమల్లేశ్వరరావులు 4/400 మీ. రిలేలో గోల్డ్‌మెడల్, కే ప్రవీణ్‌కుమార్ 200మీ. పరుగులో సిల్వర్, 400 మీ. పరుగులో సిల్వర్ మెడల్, ఎస్కే అల్మాస్400మీ. హర్డిల్స్‌లో బ్రాంజ్ పతకం సాధించారన్నారు.

ఉపాధి పనులను పరిశీలించిన డ్వామా పీడీ



పేరూరుపాడులో గోకులం షెడ్డును పరిశీలిస్తున్న డ్వామా పీడీ సిద్ధి లింగమూర్తి

బొల్లాపల్లి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సరికొండపాలెం, వెల్లటూరు, పేరూరుపాడు గ్రామాల్లో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనులు పల్నాడు జిల్లా డ్వామా పీడీ సిద్ధి లింగమూర్తి బుధవారం బొల్లాపల్లి మండలంలో పర్యటన చేశారు. పేరూరుపాడులో జరుగుతున్న గోకులం షెడ్డు నిర్మాణ పనులను వెల్లటూరులో పంట కాలువల పరిశీలన, సరికొండపాలెంలో ఉపాధి హామీ పథకంలో ఇచ్చిన పండ్ల తోటల మొక్కలను ఆయన పరిశీలించారు. అవినీతికి తావులేకుండా ఉపాధి సిబ్బంది గ్రామల్లో పనులు చేయించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధి సిబ్బంది, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

● వినుకొండ టౌన్: మండలంలోని విఠంరాజుపల్లిలో జాతీయ ఉపాధిహామి కింద చేపడుతున్న సీసీరోడ్డు పనులతోపాటు గోకుల్ షెడ్డులను జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ సిద్ధి లింగమూర్తి బుధవారం ఆకస్మికంగా తనిఖీచేశారు. వేగవంతంగా జరుగుతున్న పనులను పరిశీలించి ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు.

ఉపాధి హామీ సిబ్బందితో సమీక్ష

స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధిహామీ సిబ్బందితో డీయల్‌డీఏ వెంకటరెడ్డి, ఎంపీడీవో పుట్టారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం సమీక్ష నిర్వహించారు. నడిగడ్డలో మల్బరి షెడ్ నిర్మాణం ఎస్టిమేట్, గోకుల్ షెడ్డు నిర్మాణాలు, మస్టర్ డిమాండ్స్, వెంకుపాలెంలో నర్సరీ ఏర్పాటు, పండ్ల తోటల పెంపకం, చెరువు కుంటలు, ఫిష్‌పాండ్స్ పనులపై అధికారులు సిబ్బందితో సమావేశం నిర్వహించారు.

కిడ్నీ బాధితురాలికి గంగినేని ఫౌండేషన్ చేయూత

వినుకొండ టౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో కిడ్నీ సమస్యతో బాధపడుతున్న మంగమ్మకు గంగినేని ఫౌండేషన్ ఆధ్వర్యంలో 45 రోజులకు సరిపడా నిత్యావసర సరుకులను గంగినేని ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, త్రిపురాపురం డీసీ గంగినేని రాఘవ బుధవారం అందజేశారు. చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు దృష్టికి తీసుకువెళ్ళి బాధితురాలికి పింఛనువచ్చేలా సాయంచేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి లగడపాటి శ్రీనివాసరావు, బీసీ సెల్ నాయకులు పాల్గొన్నారు.

మైనారిటీ హక్కుల దినోత్సవం

చిలకలూరిపేట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పసుమర్రు రోడ్డులోని ఉర్దూ పాఠశాలలో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం మైనారిటి హక్కుల దినోత్సవం జరిగింది. స్థానిక బార్ అసోషియేషన్ అధ్యక్షుడు సాపా ఆదినారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. న్యాయవాదులు భాను ప్రసాద్, శివబాబు మైనార్టీల హక్కుల గురించి మాట్లాడారు.

కృష్ణవేణి డిగ్రీ విద్యార్థులకు ఉద్యోగాలు

నరసరావుపేట టౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కృష్ణవేణి డిగ్రీ కళాశాల విద్యార్థులు ఇంగ్లీషు ఫర్ యు కంపెనీకి ఎంపిక అయ్యారని ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. 48 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు తెలిపారు.

జగన్ మీడియా అసత్య ప్రచారం ఆపాలి

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి

నరసరావుపేట టౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): అవినీతి పునాదులపై ఏర్పడిన జగన్ మీడియా అసత్యప్రచారాలు చేస్తోందని, తక్షణమే దుష్ప్రచారాలను ఆపివేయాలని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 1,57,000 మందికి కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పించన్లు తీసివేసినట్లుగా విషపురాతలు రాస్తూ భయభ్రాంతులకు గురిచేయటం తగదన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో ఏ ఒక్క పింఛను దారుడికి కోత విధించలేదన్నారు. వలంటీర్ వ్యవస్థ లేకపోతే పించన్లు ఇవ్వలేరని ప్రచారంచేసిన జగన్ పత్రిక, ఇవాళ వారిపై కపట ప్రేమను చూపుతోందని అన్నారు. గతానికి భిన్నంగా మూడు నెలల వరకు పింఛను తీసుకునే అవకాశం కల్పిస్తున్నామని, నివాసం ఉంటున్న ప్రాంతానికి పింఛను మార్చుకునేలా కూటమి ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. జగన్ పత్రిక విషప్రచారం చూస్తుంటే గత ఐదేళ్ళలో అనర్హులను అర్హులుగా చూపిస్తూ పింఛన్లు ఇచ్చినవారికి ఆగిపోతాయోనని ఈ విషప్రచారం చేస్తున్నట్లు ఉందన్నారు. ఇటువంటి తప్పుడు ప్రచారాలు ఎవరూ నమ్మవద్దని కోరారు.

పది విద్యార్థుల దరఖాస్తుల్లో సవరించుకునే అవకాశం: డీఈవో

నరసరావుపేట కల్చరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వచ్చే యేడాది మార్చిలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థుల వివరాలను ఆన్‌లైన్‌లో ఎడిట్ చేసుకునే అవకాశం ఉందని జిల్లా విద్యాశాఖాధికారి ఎల్. చంద్రకళ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మరోసారి వివరాలను తనిఖీ చేయాలని డీఈవో ఆదేశించారు. ఈ అవకాశం 23వ తేదీ వరకు ఉంటుందని, ప్రధానోపాధ్యయులు ఆన్‌లైన్లో తప్పుగా నమోదుచేసిన వివరాలన్నీ సరిదిద్దుకోవాలని ఆమె ఆదేశించారు. ఈ ఎడిట్ ఆప్షన్ స్కూల్ లాగిన్‌లో మాత్రమే ఇస్తున్నామని చెప్పారు. నరసరావుపేట, సత్తెనపల్లి, గురజాల డివిజన్ స్థాయి ఉపవిద్యాశాఖాధికారులు, ప్రిన్సిపాల్‌లు పూర్తిస్థాయిలో పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. తప్పులు సవరించకుంటే ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాల్‌లు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

ఎత్తిపోతల పనులు ప్రారంభించాలి: ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

నరసరావుపేట టౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కృష్ణా, గోదావరి, పెన్నా నదుల అనుసంధానం ప్రాజెక్టు హరిశ్చంద్రాపురం నుంచి నకరికల్లు వద్ద ఎత్తిపోతల పథకం పనులను వెంటనే ప్రారంభించాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉలవలపూడి రాము డిమాండ్ చేశారు. బుధవారం నరసరావుపేటలోని సీపీఐ కార్యాలయంలో పల్నాడు జిల్లా అఖిలపక్ష రైతు, కార్మిక, ప్రజా సంఘాల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఉలవలపూడి రాము మాట్లాడుతూ ఈ ప్రాజెక్టు పూర్తి అయితే పల్నాడు, గుంటూరు, ప్రకాశం, బాపట్ల జిల్లాలలో సాగు, తాగునీరు అందటమే కాకుండా ఈ ప్రాంతం అంతా సస్యశ్యామలం అవుతుందన్నారు. ప్రాజెక్టు కింద నష్టపోతున్న రైతులకు నష్టపరిహారం ఇప్పించేందుకు, సంబంధిత శాఖ అధికారులకు, ఎంపీ, ఎమ్మెల్యే, మంత్రులకు వినతి పత్రాలు అందించడం, ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతున్న నాలుగు జిల్లా రైతులందరినీ కలుపుకొని సదస్సులు నిర్వహించడం తదితర తీర్మానాలను సమావేశంలో ఆమోదించారు.

అదనపు విద్యుత్ చార్జీలను రద్దు చేయాలంటూ నిరసన

శావల్యాపురం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులు నెలవారీ చెల్లిస్తున్న విద్యుత్ బిల్లుల్లో ప్రభుత్వం విధిస్తున్న అదనపు చార్జీలను తక్షణమే రద్దు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి కేవీఆర్ మోహన్‌చంద్ డిమాండ్ చేశారు. శావల్యాపురంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద విద్యుత్ బిల్లుల్లో నమోదవుతున్న ట్రూఅప్, ఇందనపు చార్జీలను రద్దుచేయాలని కోరుతూ మండల సీపీఎం నేతలు బుధవారం నిరసన ప్రదర్శన చేపట్టారు. మోహన్‌చంద్ మాట్లాడుతూ మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి అదానీ వద్ద ముడుపులు తీసుకొని 25ఏళ్ళపాటు ప్రజలపై రూ.లక్షకోట్లు భారంమోపే సోలార్ విద్యుత్ ఒప్పందాన్ని కూటమి ప్రభుత్వం రద్దు చేయకపోవడం దారుణమన్నారు. కోటి యాభై లక్షలమంది వినియోగదారులకు స్మార్ట్ మీటర్‌ల బిగింపును ప్రజలంతా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు.

పాల్వాయిగేట్ పీవో, ఏపీవోల సస్పెన్షన్ ఎత్తివేతపై ఫ్యాప్టో హర్షం

నరసరావుపేట టౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలలో మాచర్ల పాల్వాయి గేట్ బూత్ నంబరు 2 సంఘటనలో సస్పెన్షన్‌కు గురైన పీవో, ఏపీవోలపై సస్పెన్షన్ ఎత్తివేస్తూ పల్నాడు కలెక్టరేట్ ఉత్తర్వులు ఇవ్వడం హర్షణీయమని ఫ్యాప్టో పల్నాడు జిల్లా చైర్మన్ బీ సంపత్ బాబు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అప్పటి మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఈవీఎం పగలగొట్టిన సంఘటనలో అప్పటి పీవో వెంకట సుబ్బారావు, ఏపీవో ఎస్కే శహనాజ్ బేగమ్‌లను సస్పెన్షన్ చేసిన విషయం విదితమే. నిష్పాక్షపాతంగా విచారణను చేపట్టి త్వరితగతిన ఉపాధ్యాయులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకున్నారని ఫ్యాప్టో నాయకుడు వీ అశోక్ తెలిపారు. కలెక్టర్ పీ అరుణ్‌బాబు, డీఆర్వో మురళికి ధన్యవాదాలు తెలియజేశారు.

శిథిలావస్థలో సచివాలయ ఫర్నిచర్

సమస్య ఇది.. స్పందించరూ



తిమ్మాయపాలెం సచివాలయంలో విరిగిపోయిన ఫర్నిచర్

వినుకొండ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) మండలంలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటుచేసిన సచివాలయాల్లో ఫర్నిచర్ శిథిలావస్థకు చేరింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటుచేసిన సచివాలయాల్లో సిబ్బంది కోసం కొనుగోలుచేసిన ఫర్నిచర్ నాసిరకంగా ఉండడంతో అనతికాలంలోనే ఫర్నిచర్ మూలనపడ్డాయి. కార్యాలయాల్లో ఏర్పాటుచేసిన బల్లలు, కుర్చీలు, కంప్యూటర్ పరికరాలు కొన్ని సచివాలయాల్లో పనిచేయడంలేదని సిబ్బంది వాపోతున్నారు. ప్రధానంగా గతంలో ఏర్పాటుచేసిన ఎస్‌చైర్లు వైర్లు తెగిపోయి మూలన పడి ఉన్నాయి. దీంతో కొందరు సిబ్బంది ప్లాస్టిక్ కుర్చీలను కొనుగోలుచేసి కార్యాలయాల్లో కాలం గడపాల్సి వస్తుందని వారు వాపోయారు. సిబ్బందికి సరిపోయినన్ని కుర్చీలు అందుబాటులో ఉండడం లేదని వారు వాపోతున్నారు. అధికారులు స్పందించి సచివాలయాల్లో కొత్త ఫర్నిచర్ ఏర్పాటుచేయాలని సిబ్బంది కోరుతున్నారు.

కేంద్ర ఫిల్మ్ సెన్సార్ బోర్డు సభ్యుడిగా డాక్టర్ అప్పారావు



డాక్టర్ సిరిపురపు అప్పారావు

నాదెండ్ల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిరుమామిళ్ళ గ్రామానికి చెందిన డాక్టర్ సిరిపురపు అప్పారావు కేంద్ర ఫిల్మ్ సెన్సార్ బోర్డు సభ్యుడిగా నియమితులయ్యారు. హైదరాబాద్‌లో స్థిరపడిన ఆయన హోమియో వైద్యుడిగా పనిచేస్తున్నారు. ఫిల్మ్ సెన్సార్ బోర్డు సభ్యుడిగా మూడు సంవత్సరాల పాటు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. రామకృష్ణ మఠం, వివేకానంద కేంద్ర వంటి వివిధ ధార్మిక సంస్థల్లో పలు సేవలు అందిస్తున్నారు. అంతేగాకుండా హైదరాబాద్‌లోని బీజేపీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు.

కే-రిడ్జి స్కూల్‌లో మెగా వైద్య శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ మౌనిక

నరసరావుపేట టౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక నరరావుపేటలోని కే-రిడ్జి స్కూల్‌లో హెల్త్ బేసిక్స్ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం బుధవారం నిర్వహించారు. చిన్నారులకు దంత పరీక్షలు, సాధారణ పరీక్షలు నిర్వహించారు. డెంటల్ డాక్టర్ మౌనిక, జనరల్ డాక్టర్లు డాక్టర్ నరసింహ స్వామి పిల్లలకు వైద్య పరీక్షలు చేశారు. కంటి పరీక్షలను ఎంవీరెడ్డి కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు, డైరెక్టర్ కోమటినేని నాసరయ్య, ప్రిన్సిపాల్ బర్నబాస్, క్యాంపస్ ఇన్‌చార్జి కోట బాపూజీ, అకాడమిక్ కో ఆర్డినేటర్ పుట్ట హేమంత్ పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధమైన కృషితోనే సుస్థిరాభివృద్ధి: వెంకటరావు

నాదెండ్ల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రణాళికా బద్ధమైన కృషితోనే గ్రామాల్లో సుస్థిరాభివృద్ధిని సాధించగలుగుతామని బాపట్ల విస్తరణ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ డీ వెంకటరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు, స్థానికీకరణ అనే అంశంపై జరుగుతున్న శిక్షణ కార్యక్రమంలో బుధవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన గ్రామ స్థాయిలో సుస్థిర అభివృద్ధికి తోడ్పడే 17 అంశాలపై వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో స్వరూపరాణి, ఎంపీపీ తలతోటి రాణి, ఈవోపీఆర్‌డీ నిర్మల లక్ష్మీకుమారి, ఏఈలు వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, ఎంఈవో కృష్ణారెడ్డి, వైద్యాధికారి కవిత, ఐసీడీఎస్ సూపర్ వైజర్ నిర్మల కృష్ణ పాల్గొన్నారు.

● రొంపిచర్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సుస్థిరత పాలనపై శిక్షణ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఎంపీడీవో కే మాథ్యూబాబు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల, ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

మిరప పైరులో రంగుల అట్టలను ఏర్పాటు చేసుకోవాలి: ఏవో

ఈపూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మిరప పైరులో నల్లి ఉధృతిని తెలుసుకోవాలంటే రైతులు పొలంలో తెలుపు, పసుపు, బులుగు రంగుల అట్టలను ఏర్పాటు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఆర్ రామారావు సూచించారు. మండలంలోని ముప్పాళ్ళ, వనికుంట గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో సచివాలయం వ్యవసాయాధికారి రాచకొండ గాయత్రి, రాపర్లజగ్గారావు,విడపలపాటి హనుమయ్య, జాస్తి బుచ్చారావు,తదితరులు పాల్గొన్నారు.

● శావల్యాపురం: పంటలకు ఆశించిన తెగుళ్ళను రైతులు సకాలంలో నివారించినపుడే అధిక దిగుబడులు సాధించగలుగుతారని ఇన్‌చార్జి ఎంఏవో రామినేని రామారావు అన్నారు. మండలంలోని పోట్లూరు, ఇర్లపాడు గ్రామాలలో రైతులు సాగుచేసిన కంది, మిరప, మొక్కజొన్న తదితర పంటలను బుధవారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ వెనిగండ్ల రమాదేవి ఆంజనేయులు, ఏఈవో పూరేటి అశోక, వీఏఏ శివనాయక్ పాల్గొన్నారు.

● నాదెండ్ల: మొక్క జొన్నలో విషపు ఎరతో పురుగులను నివారించవచ్చని జిల్లా వనరుల కేంద్రం డీడీఏ ఎం శివకుమారి అన్నారు. మండలంలోని తూబాడు, చిరుమామిళ్ళ గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా క్షేత్ర స్థాయిలో పైలాన్‌ను పరిశీలించిన ఆమె రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏవో హరి ప్రసాదు, సహాయకులు సౌజన్య, సుబ్బారావు పాల్గొన్నారు.

● చిలకలూరిపేట: మండలంలోని కుక్కపల్లివారిపాలెం, వేలూరులో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి శ్రీలత, వ్యవసాయ విస్తరణ అధికారి జీవీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



కొత్తలూరులో రీ సర్వేని ప్రారంభిస్తున్న తహసీల్దార్ సుజాత

రీ సర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

- మండల తహసీల్దార్ సుజాత

కొత్తలూరు (శావల్యాపురం) డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రీ సర్వేతో గ్రామాల్లో రైతుల మధ్య నెలకొన్న భూ సమస్యలు శాశ్వతంగా పరిష్కారమవుతాయని తహసీల్దార్ సుజాత అన్నారు. మండలంలోని కొత్తలూరు రెవెన్యూ పరిధిలోని తుమ్మలకుంట, గుర్రంవారిపాలెం, కొత్తలూరు గ్రామాల్లో చేపట్టనున్న రీసర్వే ప్రక్రియను తహసీల్దార్, టీడీపీ మండలాధ్యక్షులు, ఉపసర్పంచ్ గుంటూరు సాంబశివరావు బుధవారం భూమి పూజచేసి ప్రారంభించారు. తహసీల్దార్ మాట్లాడుతూ కొత్తలూరు రెవెన్యూ పరిధిలో మొత్తం 4412.26 ఎకరాల భూ విస్తీర్ణం ఉందని, రీ సర్వేలో రైతులు భాగస్వాములు కావాలని, రీసర్వేకి వచ్చిన రెవెన్యూ అధికారులకు తమ పొలాల హద్దులను చూపించాలన్నారు. సాంబశివరావు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన రీసర్వేలో అనేక తప్పులు నమోదై వాటిని సవరణ చేసుకునేందుకు రైతులు తీవ్రఇబ్బందులు పడ్డారని, వాటిని మరోసారి పునరావృతం కాకుండా రెవెన్యూ అధికారులు తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. రీసర్వేను పారదర్శకంగా నిర్వహించాలన్నారు. రీసర్వే డీటీ నాసరయ్య, సర్వేయర్ రాజు, వీఆర్వో మంగయ్య, విలేజ్ సర్వేయర్‌లు తదితరులు పాల్గొన్నారు.